


Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 200 | శనివారం 10 జనవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ఘోర బస్సు ప్రమాదం...
# 12 మంది మృతి

- హిమాచల్ ప్రదేశ్‌లో 200 మీటర్ల లోతైన లోయలో పడిన ప్రైవేట్ బస్సు
- ప్రమాదంలో 12 మంది మృతి, 33 మందికి గాయాలు
- పొగమంచు కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా
- ఘటనపై విచారణకు ఆదేశించిన హిమాచల్ ప్రభుత్వం

హిమాచల్ ప్రదేశ్ – సూర్య వాస్తవం

హిమాచల్ ప్రదేశ్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిర్మౌర్ జిల్లాలో ప్రయాణికులతో వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి సుమారు 200 మీటర్ల లోతైన లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 33 మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. సిమ్లా నుంచి కుప్వీకి వెళుతున్న ఈ బస్సులో మొత్తం 45 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరంతా 'పోష్ట పండుగ సందర్భంగా తమ స్వగ్రామాలకు తిరిగి వెళుతున్నారు. హరిపుర్‌ధార్ మార్కెట్‌కు సమీపంలో మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో బస్సు ప్రయాణిస్తుండగా - మిగతా 2లో..



## హిమాచల్ బస్సు ప్రమాదంపై
# ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

**మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ రూ. 2 లక్షల పరిహారం ప్రకటన**

న్యూఢిల్లీ– సూర్య వాస్తవం

హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్ జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర ఘటనలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు - మిగతా 2లో..



## జల వివాదాలను
# మనమే పరిష్కరించుకుందాం

- చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా - వివాదాలపై రేవంత్ రెడ్డి కీలక సూచన
- జల వివాదాలను మనమే పరిష్కరించుకుందామన్న రేవంత్ రెడ్డి
- రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకుందామని వ్యాఖ్య
- కోర్టుల్లో కాకుండా మన సమస్యలు మనమే పరిష్కరించుకుందామని స్పష్టీకరణ
- ఏపీ ఒక అడుగు వేస్తే, తెలంగాణ పది అడుగులు వేస్తుందన్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్–సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. జల వివాదాలను పరస్పరం కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా పరిష్కరించుకుందామని అన్నారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. రాజకీయా లకు అతీతంగా నీటి సమస్యను పరిష్కరించు కోవాలని ఆయన సూచించారు. కోర్టుల ద్వారా కాకుండా మన సమస్యలను మనమే పరిష్కరించు కుందామని విజ్ఞప్తి చేశారు. జల వివాదం విషయంలో



రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా, నీళ్లు కావాలా అని నన్ను అడిగితే - మిగతా 2లో..

## మన భూములపై
# ఆయన ఫొటో ఏంటి?

- తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో సీఎం చంద్రబాబు పర్యటన
- రాజముద్రతో కూడిన 'మీ భూమి - మీ హక్కు' పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ ప్రారంభం
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భూములు కాజేసేందుకు గత ప్రభుత్వం కుట్ర పన్నిందన్న చంద్రబాబు
- వివాదాస్పద చట్టాన్ని రద్దు చేస్తూనే రెండో సంతకం పెట్టానని వెల్లడి
- ఇకపై భూ రికార్డులను ట్యాంపర్ చేయకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భద్రత




రాయవరం – సూర్య వాస్తవం

గత ప్రభుత్వ అస్తవ్యస్త, వివాదాస్పద భూ విధానాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల భూములను కాజేసేందుకే ప్రమాదకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చారని, అందుకే తాను అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని రద్దు చేస్తూ రెండో సంతకం పెట్టానని స్పష్టం చేశారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజకవర్గంలోని రాయవరంలో 'మీ భూమి – మీ హక్కు' - మిగతా 2లో..

## ఈ నెల 28 నుంచి
# కేంద్ర బడ్జెట్ సమావేశాలు..

- రెండు విడతలుగా ఏప్రిల్ 2 వరకు పార్లమెంటు సమావేశాలు కొనసాగింపు
- అరుదుగా ఆదివారం రోజున ఫిబ్రవరి 1న బడ్జెట్ సమర్పణ
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సభ ప్రారంభం
- షెడ్యూల్ వెల్లడించిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## సముద్రంలోకి వృథగా పోయే
# నీటి కోసం గొడవలెందుకు?

- మిగులు జలాల కోసం ఏపీ, తెలంగాణ మధ్య వివాదాలు వద్దన్న సీఎం చంద్రబాబు
- పోలవరం పూర్తయితే రెండు రాష్ట్రాలకూ నీటి కొరత ఉండదని స్పష్టీకరణ
- తూర్పుగోదావరి జిల్లా రాయవరం గ్రామంలో చంద్రబాబు వ్యాఖ్యలు

రాయవరం – సూర్య వాస్తవం

సముద్రంలోకి వృథగా పోతున్న నీటిని వాడుకునే విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య వివాదాలు ఎందుకని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. గోదావరి మిగులు జలాల వినియోగంపై రెండు తెలుగు రాష్ట్రాల



మధ్య అనవసరమైన గొడవలకు అర్థం లేదని ఆయన స్పష్టం చేశారు. శుక్ర వారం తూర్పు గోదావరి జిల్లా, రాయవరం గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్‌బుక్కులు పంపిణీ చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పోలవరం–నల్లమల సాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరాలు, రాయలసీమ ఎత్తిపోతల పథకంపై జరుగుతున్న వివాదాలను ప్రస్తావిస్తూ.. "కొందరికి నీళ్లు కాదు, కేవలం వివాదాలే కావాలి" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాల - మిగతా 2లో..




## ఏపీకి పెట్టుబడులు రావడానికి
# మూడు ప్రధాన కారణాలివే

- పుణే పబ్లిక్ పాలసీ ఫెస్టివల్‌కు హాజరైన ఏపీ మంత్రి నారా లోకేశ్
- రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వాల కొనసాగింపు అత్యంత కీలకమని వెల్లడి
- ఫిబ్రవరిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం
- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు వేగంగా అడుగులు

2లో

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# జల వివాదాలను మనమే పరిష్కరించుకుందాం

(మొదటిపేజీ తరువాయి)
తెలంగాణకు నీళ్లు కావాలని చెబు తానని, అదే సమయంలో వివాదాలు కావాలా, పరిష్కారం కావాలా అని అడిగితే పరిష్కారం కావాలని స్పష్టంగా చెబుతానని ఆయన అన్నారు.

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేడుక ద్వారా విజ్ఞప్తి చేస్తున్నానని, కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు సృష్టించవద్దని కోరారు. అలా అడ్డంకులు కలిగిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని, దీనివల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదాలు కోరుకోవడం లేదని, పరిష్కారం మాత్రమే కోరుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. తమకు కావలసింది రాజకీయ ప్రయోజనాలు కాదని, ప్రజల ప్రయోజనాలని అన్నారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ ఉండాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాల్సిందే అన్నారు. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని వ్యాఖ్యానించారు. జల వివాదాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఒక్క అడుగు ముందుకు వేస్తే తాము 10 అడుగులు ముందుకు వేస్తామని ఆయన అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన రాష్ట్రమని అన్నారు. పెద్ద పెద్ద కంపెనీలకు మన దేశానికి చెందిన వారే సీఈవోలుగా ఉన్నారని ఆయన తెలిపారు.

# సముద్రంలోకి వృథాగా పోయే నీటి కోసం గొడవలెందుకు?

(మొదటిపేజీ తరువాయి)
విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, వివాదాల వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని ఆయన తేల్చిచెప్పారు.

“ప్రతి ఏటా సముద్రంలోకి వృథగా పోతున్న 300 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రంలో కరవు అనే మాటే ఉండదు. పోలవరం పూర్తయితే ఈ ప్రాంతంలో నీటి సమస్యలు తీరతాయి. పోలవరం నుంచి విశాఖపట్నం, అక్కడి నుంచి వంశధార వరకు నీటిని తీసుకెళతాం. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణ కూడా మిగులు జలాలను వాడుకోవచ్చు” అని చంద్రబాబు వివరించారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి తరలించి, అక్కడి నుంచి రాయలసీమకు నీరందించడం వల్లే ఆ ప్రాంతం హార్టికల్చర్ హబ్‌గా మారుతోందని గుర్తుచేశారు.

# హిమాచల్ బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

(మొదటిపేజీ తరువాయి)
త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. శుక్రవారం సిర్మౌర్ జిల్లాలోని హరిపుర్‌ధార్ సమీపంలో 50 మందికి పైగా ప్రయాణికులతో వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 12 మంది మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తదితరులు కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధితులకు అండగా నిలవాలని, అవసరమైన సహాయం అందించాలని వారు పిలుపునిచ్చారు.
సిమ్లా నుంచి కుప్వి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. బస్సు నుజ్జునుజ్జు కావడంతో సహాయక చర్యలు కష్టతరంగా మారాయి. అధికారులు చేరుకోకముందే స్థానికులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని సీఎం సుఖు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

# సుంకులమ్మ గుడి వద్ద ప్రమాణాల పంచాయతీ

## - ఒకరి తరువాత ఒకరు వచ్చి వెనుదిరిగిన వైనం

**పులివెందుల – సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలో టిడిపి, వైకాపా నాయకుల మధ్య ఆరోపణల నిర్ధారణ కోసం సుంకులమ్మ గుడి వద్ద శుక్రవారం ప్రమాణాల పంచాయతీ చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే గడచిన రెండు రోజులుగా అటు వైకాపా ఇటు తెదేపా పరస్పర విమర్శలు చేసుకుంటూ



వ్యక్తిగత ఆరోపణల నేపథ్యంలో వాటిని నిరూపించేందుకు సుంకులమ్మ గుడి వద్దకు చేరుకున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తాను ఎలాంటి ఒత్తిడిలకు గురి కాలేదని తమ వైపు నుండి ఎటువంటి రాయబారాలను నడపలేదంటూ అమ్మవారి మీద ప్రమాణం చేశారు. చెప్పిన మాటకు కట్టుబడి వరప్రసాద్ అమ్మవారి ఆలయంలో ప్రమాణం చేయడం మంచి పరిణామం అని, ఆరోపణలు చేసిన వారు కూడా ప్రమాణం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని వైకాపాశ్రేణులు డిమాండ్ చేస్తుండగా, తాము చేసిన ఆరోపణలకు వరప్రసాద్ చేసిన ప్రమాణానికి పొంతనలేదని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. ఏది ఏమైనప్పటికీ ప్రమాణాల పంచాయతీ గుడి వద్దకు చేరుకోగా ఇరువర్గాలు ఒకే సమయంలో కాకుండా వేరు వేరు సమయాల్లో అక్కడికి చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడం పట్ల బందోబస్తు నిర్వహించిన పోలీసు బృందాలు ఊపిరి పీల్చుకున్నారు.

# ఘోర బస్సు ప్రమాదం... 12 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)
ఈ ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు కారణంగా బస్సు రోడ్డుపై నుంచి జారిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాద తీవ్రతకు బస్సు నుజ్జునుజ్జయింది.
ప్రమాద సమాచారం అందిన వెంటనే స్థానికులు, పోలీసులు, ఆరోగ్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని నాహన్, రాజ్‌గఢ్ ఆసుపత్రులకు తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స కోసం సిమ్లాలోని ఐజీఎంసీ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రమాదంపై మెజిస్టీరియల్ విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించింది.



# మన భూములపై ఆయన ఫొటో ఏంటి?

(మొదటిపేజీ తరువాయి)
కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొందరు రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసి, వాటిపై ఉన్న క్యూఆర్ కోడ్, సాంకేతికతను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. “మన పూర్వీకులు కష్టపడి సంపాదించిన, మన స్వార్జితమైన భూమిపై ఆయన (జగన్) ఫొటో ఏమిటి? సరిహద్దు రాళ్లపై ఆయన ముద్రలు వేయడమేంటి? అని గతంలోనే ప్రశ్నించాను. ఇది అహంకారానికి నిదర్శనం” అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకపోయుంటే, ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో ప్రజల భూములన్నీ తమకు నచ్చిన వారికి కట్టబెట్టేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. “నిన్నామొన్న రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తులు చాలా ప్రమాదకరమైన ఆలోచన చేశారు. మీ భూముల వివరాలన్నీ వారి అనుచరులు అమెరికాలో పెట్టుకు న్నారు. ప్రజలు సరైన సమయంలో బ్యాలెట్ ద్వారా తగిన బుద్ధి చెప్పారు” అని అన్నారు. భూమి అంటే రైతుకు కేవలం ఆస్తి కాదని, అదొక విశ్వాసం, కుటుంబంతో పెనవేసుకుపోయిన సెంటిమెంట్ అని చంద్రబాబు పేర్కొన్నారు. కరోనా సమయంలో అందరూ సెలవులు తీసుకున్నా, దేశానికి అన్నం పెట్టే రైతుకు మాత్రం సెలవు లేదని గుర్తుచేశారు.

గత పాలకుల తీరు వల్ల తాను ఎక్కడికి వెళ్లినా భూ వివాదాలకు సంబంధించిన పిటిషన్లే ఎక్కువగా వస్తున్నాయని, వాటన్నింటినీ పరిష్కరించాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని తెలిపారు. స్వర్గీయ ఎన్టీఆర్ కరణం, మునసబు వ్యవస్థను రద్దు చేసి రైతులకు మేలు చేస్తే, తెలంగాణలో పండుగ చేసుకున్నారని, కానీ మన రాష్ట్రంలో కొందరు దానిని వ్యతిరేకించారని గుర్తుచేశారు. ఇకపై భూ వివాదాలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో రికార్డులను పక్కాగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. “తహసీల్దారు కార్యాలయంలో కాదు, గ్రామసభలు నిర్వహించి, ప్రజల మధ్యనే పాస్‌పుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించాను. పద్ధతి ప్రకారం రీసర్వే చేయించి, రికార్డులను ట్యాంపర్ చేయడం అసాధ్యమయ్యేలా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని వినియోగిస్తున్నాం. పాస్‌బుక్‌పై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు, మీ భూమి వివరాలన్నీ క్షణాల్లో కనిపిస్తాయి” అని వివరించారు. ఈ రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను రైతులకు, భూ యజమానులకు సత్వరమే అందించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# ఏపీకి పెట్టుబడులు రావడానికి మూడు ప్రధాన కారణాలివే

- పుణే పబ్లిక్ పాలసీ ఫెస్టివల్‌కు హాజరైన ఏపీ మంత్రి నారా లోకేశ్
- రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వాల కొనసాగింపు అత్యంత కీలకమని వెల్లడి
- ఫిబ్రవరిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం
- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు వేగంగా అడుగులు

**పుణే –సూర్య వాస్తవం**
రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వాల కొనసాగింపు ఎంతో కీలకమని, గత ప్రభుత్వ హయాంలో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ల (పీపీఏ) రద్దు వంటి నిర్ణయాల వల్ల చాలా కంపెనీలు భయపడి పొరుగు రాష్ట్రాలకు తరలివెళ్లాయని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సుస్థిర పాలన ఆవశ్యకతను ప్రజలు గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. పుణేలోని గోఖలే ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనమిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘పబ్లిక్ పాలసీ ఫెస్టివల్లో లోకేశ్ కీలకోపన్యాసం చేశారు.

**పరిశ్రమలు రావడానికి మూడు కారణాలు**
ఆంధ్రప్రదేశ్‌కు గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలు క్యూ కట్టడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని లోకేశ్ వివరించారు. “మొదటిది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం. రెండోది ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'. పరిశ్రమలతో ఒప్పందం కుదిరిన తర్వాత, ఆ ప్రాజెక్టును మా సొంతదిగా భావించి వేగంగా అనుమతులు ఇస్తున్నాం. మూడోది రాష్ట్రంలో, కేంద్రంలో ‘నమో’ (నాయుడు, మోదీ) నేతృత్వంలోని డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు అని తెలిపారు.
ఆర్సెలర్ మిట్టల్ అధినేత ఆదిత్య మిట్టల్‌తో ఒకేఒక్క జూమ్ కాల్ మాట్లాడి, వారి సమస్యను 24 గంటల్లో పరిష్కరించడం వల్లే దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను ఏపీకి తీసుకురాగలిగామని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు పనులు ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు.

**టెక్నాలజీతో పాలనలో విప్లవం**
పరిపాలనలో టెక్నాలజీని వినియోగిస్తూ విప్లవాత్మక మార్పులు తెస్తున్నామన్నారు. “మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 36 శాఖలకు చెందిన వెయ్యి రకాల సేవలను అందిస్తున్నాం. ఏఐ టెక్నాలజీతో మంగళగిరిలో స్కిల్ సెన్సస్ పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాం. త్వరలోనే భూ రికార్డులను కూడా బ్లాక్‌చైన్ టెక్నాలజీపైకి తీసుకొచ్చి, 24 గంటల్లో టైటిల్ మార్పు చేసేలా కసరత్తు చేస్తున్నాం” అని వివరించారు.

**‘లిఫ్ట్ పాలసీతో పరిశ్రమల వెల్లువ**
ఐటీ పరిశ్రమలను ఆకర్షించేందుకు ‘లిఫ్ట్ పాలసీని తీసుకొచ్చామని లోకేశ్ తెలిపారు. ఒక ఎకరాకు 500 ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు 99 పైసలకే భూమి కేటాయించేలా ఈ విధానాన్ని రూపొందించామని, కాగ్నిజెంట్ రాకతో పరిశ్రమల ప్రవాహం మొదలైందని చెప్పారు. పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను తానే స్వయంగా 26 వాట్సాప్ గ్రూపుల ద్వారా పర్యవేక్షిస్తున్నానని అన్నారు.

**సీఎం డ్రీమ్ ప్రాజెక్ట్ క్వాంటమ్ వ్యాలీ**
ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్వాంటమ్ వ్యాలీ అత్యంత ఇష్టమైన ప్రాజెక్ట్ అని లోకేశ్ అభివర్ణించారు. అమరావతిలో ఏర్పాటు కానున్న ఈ వ్యాలీ దేశానికే దిక్సూచిగా నిలుస్తుందన్నారు.

ఐబీఎం, టీసీఎస్, ఐఐటీ మద్రాస్ వంటి సంస్థలను ఏకతాటిపైకి తెచ్చి ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌ను అమలు చేసేందుకు యువ మంత్రుల బృందంతో కలిసికట్టుగా పనిచేస్తున్నామని, రాష్ట్రానికి భారీగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) ఆకర్షించడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు.

# ఈ నెల 28 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు..

**న్యూఢిల్లీ–సూర్య వాస్తవం**
2026 సంవత్సరానికి సంబంధించిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. జనవరి 28 నుంచి ఈ సమావేశాలు జరగనున్నా యని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌ను ఆదివారం రోజున ప్రవేశపెట్టే అవకాశం ఉండటం ఈ సమావేశాల ప్రత్యేకతగా నిలవనుంది. రెండు విడతలుగా సాగే ఈ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి.

**రాష్ట్రపతి ఆమోదం.. అధికారిక ప్రకటన**
కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు, పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారని మంత్రి కిరణ్ రిజిజు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. “2026 బడ్జెట్ సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి. తొలి విడత సమావేశాలు ఫిబ్రవరి 13తో ముగుస్తాయి. అనంతరం మార్చి 9న సభ తిరిగి సమావేశమవుతుంది. అర్థవంతమైన చర్చలకు, ప్రజలు కేంద్రంగా సాగే పాలనకు ఈ సమావేశాలు అత్యంత కీలకం” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

**ఆదివారం బడ్జెట్.. ఒక అరుదైన ఘట్టం**
నివేదికల ప్రకారం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ ఫిబ్రవరి 1న 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఫిబ్రవరి 1 ఆదివారం కావడం గమనార్హం. పార్లమెంట్ చరిత్రలో ఆదివారం రోజున బడ్జెట్ ప్రవేశపెట్టడం చాలా అరుదు. దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇక బడ్జెట్‌కు ముందు, దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరును సమీక్షించే ఆర్థిక సర్వేను జనవరి 29 లేదా 30న పార్లమెంట్ ఉభయ సభల ముందు ఉంచనున్నారు.

**రెండు విడతలుగా సమావేశాలు.. ఎందుకంటే?**
ఈ బడ్జెట్ సమావేశాలను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి విడత జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతుంది. ఆ తర్వాత సభకు విరామం ఉంటుంది. ఈ విరామ సమయంలో వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘాలు బడ్జెట్ పద్దులు, వివిధ పథకాలకు కేటాయింపులపై లోతైన సమీక్ష జరుపుతాయి. అనంతరం మార్చి 9న రెండో విడత సమావేశాలు ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. ఈ దశలో స్థాయీ సంఘాల నివేదికలపై చర్చించి, తుది ఆమోదం తెలుపుతారు.

**కీలకంగా మారనున్న బడ్జెట్ సమావేశాలు**
సంప్రదాయం ప్రకారం, సమావేశాల మొదటి రోజైన జనవరి 28న పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఈ ప్రసంగంలో ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలను ఆమె వివరిస్తారు. ఆర్థిక వృద్ధి, ద్రవ్యలోటు నియంత్రణ, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటి కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమావేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పన్నులు, ప్రభుత్వ వ్యయం, విధానపరమైన సంస్కరణలపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్రపతి ఆమోదంతో సమావేశాల నిర్వహణకు అధికారికంగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

# సంపాదకీయం

## భారత్ చుట్టూ సమస్యలు



ప్రపంచ రాజకీయాల్లో మార్పు సంకేతాలు కనిపించాయి. ప్రపంచం ఒక కొత్త అధ్యాయం దిశగా కదులుతున్నట్టు అనిపించింది. కొత్త నిర్మాణాన్ని రూపొందించే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్‌లో ఈ ఏడాది జరిగే ఎన్నికలు ఆయా దేశాల అంతర్గత అంశాలు మాత్రమే కాదు. ఈ ఎన్నికలు దక్షిణాసియా స్థిరత్వం, భారత భద్రతా సమస్యలు, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలతో లోతుగా ముడిపడి ఉన్నాయి. మరోవైపు, యుక్రెయిన్-రష్యా యుద్ధం ఇకపై యూరప్‌కు మాత్రమే పరిమితమైన వివాదం కాదు. ఇది ప్రపంచ ఇంధన సరఫరాలు, ఆహార భద్రత, అంతర్జాతీయ నైతిక విలువలకు తీవ్రమైన పరీక్షగా మారింది.భారత్ ఇప్పటివరకూ చర్చలు, సమన్వయం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి విధానాన్ని అనుసరిస్తోంది. భారత్ స్పష్టంగా ఏదో ఓవైపు ఉండాల్సి వస్తుందా?భారత్ చాలాకాలంగా 'బహుళ ధ్రువ ప్రపంచ క్రమం' గురించి మాట్లాడుతోంది. అంటే అధికారం కొన్ని దేశాల చేతుల్లో మాత్రమే కేంద్రీకృతమై ఉండని ప్రపంచం. అయితే 'బహుళ ధ్రువ ప్రపంచం' అనేది ఒక ఆలోచన మాత్రమేనా, లేదా అది నిజంగా వాస్తవ రూపం దాల్చగలదా?ఈ చర్చలో భారత్ - చైనా సంబంధాలు కూడా కేంద్రబిందువయ్యాయి. ఒకవైపు, రెండు దేశాలు ఆర్థికపరంగా ఒకదానిమీద ఒకటి బాగా ఆధారపడి ఉన్నాయి. మరోవైపు సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. వ్యూహాత్మక అపనమ్మకం పెరుగుతోంది. చర్చలకు మార్గాలు తెరిచే ఉన్నప్పటికీ, అదే సమయంలో అపనమ్మకం స్పష్టంగా ఉంది.భారత విదేశాంగ విధానం కూడా ఆర్థిక రంగంలో కొత్త దశలోకి ప్రవేశించింది. అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ప్రారంభమవుతున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాల్లో సవాళ్లు కొనసాగుతున్నాయి.గత ఏడాది ప్రారంభంలో, డోనల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన్ను కలిసిన మొదటి నలుగురు ప్రపంచ నాయకులలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఒకరు. ఈ సమావేశంలో మోదీని తన "గొప్ప స్నేహితుడు" అని ట్రంప్ అభివర్ణించారు.అయితే కొన్నినెలలుగా మోదీ, ట్రంప్ మధ్య సంబంధాలు ట్రంప్ మొదటి పదవీకాలంలో కనిపించినంతగా లేవు. ఈ మారుతున్న వాతావరణంలో ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై రెండు రకాల సుంకాలను విధించింది. ఒకటి వాణిజ్య కారణాలతో, ఇంకొకటి రష్యా నుంచి చమురు కొంటున్నందుకు.భారత్‌పై అమెరికా మొత్తం 50 శాతం సుంకాలు విధించింది. ఆసియా దేశాలలో విధించిన అత్యధిక సుంకం ఇది. ఆస్ట్రేలియాతో చర్చలు మంచిస్థాయిలో ఉన్నాయి. న్యూజీలాండ్, ఒమన్‌లతో ఒప్పందాలు కుదిరాయి. యూకేతో యూరోపియన్ యూనియన్‌తో, ఆ తర్వాత అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే భారత్‌కు చాలా ఉపశమనం కలుగుతుంది..నేపాల్‌లో సార్వత్రిక ఎన్నికలు 2026 మార్చి 5న జరగనున్నాయి. బంగ్లాదేశ్‌లో 2026 ఫిబ్రవరి 12న ఎన్నికలు జరుగుతాయి. రెండూ భారత్‌కు పొరుగు దేశాలు, వ్యూహాత్మకంగా ముఖ్యమైనవిగా పరిగణిస్తారు.ఇటీవలి సంవత్సరాలలో, ఈ రెండు దేశాలతో భారత సంబంధాలు మునుపటిలా సజావుగా లేవు.మరి.. నేపాల్, బంగ్లాదేశ్‌లో ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వాలు ఏర్పడితే, భారత్ తన సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి అవకాశం దక్కుతుందా? బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరిగిన సంఘటనలను పరిగణనలోకి తీసుకుంటే అక్కడి ఎన్నికలు భారత్‌కు చాలా ముఖ్యమైనవి"

ఎన్నికల తర్వాత ఏ కొత్త ప్రభుత్వం ఏర్పడినా, భారత్ దానితో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నించాలని ఆయన భావిస్తున్నారు. షేక్ హసీనా ప్రభుత్వాన్ని ప్రస్తావిస్తూ, ఆ సమయంలో రెండు దేశాల మధ్య సంబంధాలు చాలా బలంగా ఉన్నాయన్నారు. కానీ, భారత్ ఒక పెద్ద వ్యూహాత్మక తప్పు చేసిందనే వాదన ఉంది,షేక్ హసీనా అధికారంలో ఉన్నప్పుడు సంబంధాలు చాలా బాగుండేవి. కానీ, బీఎన్‌పీ, ప్రతిపక్ష పార్టీలతో సంబంధాలకు ప్రయత్నించకపోవడం తప్పు. ఒకప్పుడు మనకు మంచి పొరుగు దేశం, మిత్రుడైన బంగ్లాదేశ్‌ను ఇపుడు మనం కోల్పోయాం. ఇప్పుడు తీసుకురావడం చాలా ముఖ్యం" అని అన్నారు.భారత్ తన విదేశాంగ, వాణిజ్య విధానంలో వైవిధ్యాన్ని కొనసాగించాలని ఆమె సూచించారు.భారత్ అనేక దేశాలతో సంబంధాలను కొనసాగించాలి, ఏదేని విషయం కోసం ఒకే దేశంపై ఆధారపడకుండా ఉండాలి. ఒకే దేశంపై ఆధారపడితే, అది సమస్యలను సృష్టించవచ్చు" అన్నారు అర్పితా ముఖర్జీ.భారత్ చాలాకాలంగా రష్యాతో మంచి సంబంధాన్ని కలిగి ఉంది.

చైనా ప్రపంచ సూపర్ పవర్‌గా మారుతోంది. కీలకమైన ఖనిజాలు, ఆయుధాలలో దాని పాత్రను చాలా ఉంది,అమెరికా ఎజెండాను పరిశీలిస్తే, అది 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అంటే 'మాగా'. ఈ ఎజెండా కింద, అది దాదాపు అన్ని దేశాలపై సుంకాలను విధించింది". అమెరికా సుంకాలు విధించినప్పుడు, ఎవరు మిత్రుడు, ఎవరు శత్రువు అని చూడలేదుభారత్ ఎల్లప్పుడూ చైనాతో మంచి, బలమైన సంబంధాలను కొనసాగించాలి. వాణిజ్య సమతుల్యత మనకు వ్యతిరేకంగా ఉండటమే. ప్రస్తుత కాలంలో అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్‌తో వ్యవహరించడంలో ఏ దేశ విదేశాంగ విధానానికైనా పెద్ద పరీక్షే.2023లో అధ్యక్షుడు బైడెన్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని యూఎస్ పర్యటనకు ఆహ్వానించారు. చాలా తక్కువ మంది ప్రపంచ నాయకులకు దక్కిన గౌరవమది" అని ఆయన గుర్తుచేశారు.ప్రధాని మోదీ అయినా లేదా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అయినా, ప్రతి ఒక్కరికీ వారి సొంత అహం ఉంటుంది. కానీ, అతిపెద్ద అహం ట్రంప్. ఆ అహాన్ని

# భారతదేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయిని షేక్ ఫాతిమా బేగం

**- షేక్ ఫాతిమా బేగం జయంతి**
**- 9 జనవరి 1831**




భారతదేశంలో మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయిణి షేక్ ఫాతిమా బేగం 1831 జనవరి 9న మహారాష్ట్రలోని గంజివాడిలో జన్మించారు. ఆమె పూర్వజులు కట్టుబాట్లతో ఉన్న ముస్లిం సమాజానికి చెందినవారు. ఆ కాలంలో మహిళలకు హక్కులు, విద్యా అవకాశాలు చాలా పరిమితముగా ఉండేవి. ఈ పరిస్థితుల్లో షేక్ ఫాతిమా ఫాతిమా మహిళల విద్య, లింగసమానత్వం కోసం జీవితమంతా కృషి చేసింది.

**సావిత్రిబాయి పూలేతో స్నేహం, సామాజిక ఉద్యమం**

షేక్ ఫాతిమా బేగం, భారతీయ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిణి సావిత్రిబాయి పూలే స్నేహితురాలు. సావిత్రిబాయి మరియు మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులు నడిపిన సామాజిక పరివర్తన ఉద్యమంలో ఫాతిమా బేగం చురుకుగా పాల్గొన్నారు. ఆడపిల్లలకు చదువుదల అవకాసాలు, అణగారిన వర్గాల అభివృద్ధి, మరియు విద్యారంగంలో లింగవివక్షను నిర్మూలించడం కోసం ఆమె తన జీవితాన్ని అంకితం చేసింది. ఫాతిమా బేగం ఉపాధ్యాయినిగా మాత్రమే కాక, సామాజిక సేవకురాలు, సంఘ సంస్కర్త కూడా అయి, ప్రాచీన సమాజంలో మహిళలకు, దిగువ వర్గాలకు విద్యా అవకాశాలు తీసుకువచ్చింది.

**మొదటి పాఠశాల, "దేశీయ గ్రంథాలయం"**

1848లో, ఫాతిమా బేగం తన ఇంట్లోనే చిన్న పాఠశాలను ప్రారంభించి, దానిని "దేశీయ గ్రంథాలయం" అని పేరు పెట్టారు. సావిత్రిబాయి పూలే సుగుణాబాయి సహకారంతో, ఈ పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక పాఠాలు బోధించబడినవి. ఫాతిమా బేగం 1856 వరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తూ, విద్యార్థులను ప్రోత్స హించడం, సమాజంలో విద్యా ప్రవేశాన్ని పెంపొందించడం, ఆడపిల్లలకు ప్రత్యేక శ్రద్ధ చూపించడం వంటి పనులు చేశారు.

**చరిత్రలో ఫాతిమా బేగం పాత్ర**

మహారాష్ట్రలో బ్రాహ్మణాధిపత్యం ఉన్న సమాజంలో పూలే దంపతులు మరియు ఫాతిమా బేగం చేసిన విద్యా ప్రచారం, బ్రాహ్మణ పురోహితులు మరియు ఛాందస వాదుల వ్యతిరేకతకు గురైంది. పాఠశాలకు వెళ్ళే మార్గంలో వింత విధాలుగా అడ్డంకులు ఎదుర్కొన్నా, ఫాతిమా బేగం ధైర్యంగా, సహనంతో, తన సోదరుడు షేక్ ఉస్మాన్ ఖాన్ మరియు పూలే దంపతుల ప్రోత్సాహంతో విద్యాబోధన కొనసాగించారు. ఫాతిమా బేగం ముస్లిం సమాజంలో విద్యా చైతన్యాన్ని ప్రేరే పించడమే కాక, కులవివక్ష, లింగ వివక్ష, మరియు సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసింది.

**ఫాతిమా బేగం, పూలే దంపతుల సహకారం**

పూలే దంపతులు ఆడపిల్లలకు చదువు ఇవ్వడం, అణగారిన వర్గాల విద్యావ్యాప్తి కోసం అడ్డంకులు ఎదుర్కొన్నప్పటికీ, ఫాతిమా బేగం వారు ప్రతి అడుగులో మద్దతుగా నిలిచారు. సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావు పూలేకు వ్రాసిన లేఖలో ఇలా చెప్పారు: "ఫాతిమా నాకు బాగా సహకరించారు. ఆమె సహాకారంతోనే నేను నా సేవా కార్యక్రమాలు కొనసాగించగలిగాను. ఈ విధంగా ఫాతిమా బేగం భారతీయ సమాజంలో మహిళా విద్యా పరిష్కారానికి ప్రథమ యోధురాలు గా నిలిచారు.

**సార్వజనీక గుర్తింపు, వారసత్వం**

షేక్ ఫాతిమా బేగం జీవితం, త్యాగం, మరియు పోరాటం ఈనాటి భారతీయులు, ముఖ్యంగా ముస్లిం మహిళలు, యువత అధ్యయనకారులు తెలుసుకోవలసినది. సమాజ పరివర్తన కోసం.. బహుజనులలో విద్యావ్యాప్తి కోసం.. లింగ సమానత్వాన్ని సాధించడానికి ఆమె చేసిన కృషి, ప్రేరణ అందరికీ తెలియాలి. ప్రభుత్వం సావిత్రి బాయి పూలే, షేక్ ఫాతిమా బేగం పేర్లతో పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు నెలకొల్పి వారిని స్మరించాలి.

**ఫాతిమా బేగం -- ప్రేరణ**

భారతదేశంలోని మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయిణిగా, సమాజంలోని దిగువ వర్గాలకు, మహిళలకు విద్యావ్యాప్తి కోసం త్యాగం చేసిన షేక్ ఫాతిమా బేగం ప్రతి తరగతి విద్యార్థి, యువత కోసం ప్రేరణ. ఆమె జీవితంలో చూపిన ధైర్యం, దృఢనిశ్చయం, సామాజిక సేవకు అంకితం ప్రతి భారతీయుడికి ఆదర్శం.

# రాజధాని రచ్చ...



**విజయవాడ - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ లో మరోసారి రాజధాని అమరావతి హాట్ టాపిక్ గా మారింది. రెండో విడత భూ సమీకరణ జరుగుతున్న నేపథ్యంలో వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. మరోసారి ఏపీ రాజకీయాల్లో వేడిని పుట్టించాయి. వైఎస్ జగన్ ఈ సమయంలో రాజధాని అమరావతిపై వ్యాఖ్యలు చేయడం కొంత ప్రభుత్వాన్ని కూడా ఇబ్బందుల్లోకి నెట్టినట్లయింది. దీంతో వైఎస్ జగన్ కు మంత్రులు కౌంటర్ ఇస్తున్నారు. . విజయవాడ, గుంటూరుకు నలభై కిలోమీటర్ల దూరంలో రాజధాని అమరావతి ఉందని తెలిపారు. రాజ్యాంగంలో రాజధాని అనే పదం ఎక్కడా లేదని జగన్ అన్నారు. నదీపరీవాహక ప్రాంతంలో రాజధాని నిర్మాణం చేయడం సరికాదని వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. అక్కడ నగరం నిర్మించాలనుకోవడం సరికాదని జగన్ వ్యాఖ్యానించారు. అమరావతిలో మౌలిక సదుపాయాలు లేవని జగన్ అన్నారు.అక్కడ నీరు, విద్యుత్తు, రహదారి సౌకర్యం కూడా లేదని వైఎస్ జగన్ అన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుని పనిచేస్తే అదే రాజధాని అవుతుందని వైఎస్ జగన్ అన్నారు. అమరావతి రాజధానిగా అనువైన ప్రదేశం కాదని వైఎస్ జగన్ అన్నారు. అసలు మౌలిక సదుపాయాలు లేని చోట రాజధాని నిర్మాణం చేయడం సరికాదని తెలిపారు. రివర్ బేసిన్ లో నిర్మాణాలు చేపట్టడం సరికాదని జగన్ వ్యాఖ్యానించారు. భవనాలు కట్టుకోవాలన్నా అనుమతి కావాల్సి ఉంటుందని జగన్ వ్యాఖ్యానించారు. గుంటూరు - విజయవాడ మధ్య రాజధాని నిర్మాణం చేపట్టి ఉంటే బాగుండేదని జగన్ అభిప్రాయపడ్డారు. అయితే మంత్రి నారాయణ మాట్లాడుతూ జగన్ కు రాజధాని పై అవగాహన లేదని అన్నారు.నదీ గర్భంలో నిర్మాణాలు చేపడతామని మంత్రి నారాయణ ప్రశ్నించారు. గతంలో శాసనసభలో అమరావతి లో రాజధాని నిర్మాణంపై జగన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఉపయోగించుకోవడం కోసమేనన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో మరోసారి రాజధాని రచ్చ మొదలయింది. రైతుల్లో నెలకొన్న అసంతృప్తి రెండో విడత భూ సమీకరణ నేపథ్యంలో మొదటి సారి చేసిన భూ సమీకరణ చేసిన దాంట్లోనే అభివృద్ధిచేయలేన్న అభిప్రాయం వినిపిస్తున్న సమయంలో ఈ వ్యాఖ్యలు కలకలం రేపాయి. అమరావతి పనులు వేగం పుంజుకున్న సమయంలో ఓర్చుకోలేక జగన్ ఈ రకమైన దాడికి రాజధానిపై దిగారని మంత్రులు విరుచుకుపడుతున్నారు. మొత్తం మీద మరోసారి అమరావతి రాజధాని రాజకీయంగా రచ్చగా మారింది.

# రప్పా..రప్పా... రక్తాభిషేకాలు..

**అండగా ఉంటామంటున్న జగన్**



**అనంతపురం- సూర్య వాస్తవం :** వైసీపీ కార్యకర్తలపై నమోదు అవుతున్న కేసుల అంశం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని వైసీపీ శ్రేణులపై నమోదు చేస్తున్న కేసులకు పార్టీ తరఫున పూర్తిస్థాయి న్యాయ సహాయం అందించాలని ఆయన నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం మాజీ హోంమంత్రి తానేటి వనిత నేతృత్వంలో తనను కలిసిన కార్యకర్తలకు జగన్ స్పష్టమైన భరోసా ఇచ్చారు.కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడాల్సిన అవసరం లేదని, తమపై నమోదైన కేసుల విషయంలో పార్టీ లీగల్ టీం పూర్తిగా అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కేసులు నమోదు అవుతున్నాయని, న్యాయపరంగా పోరాడి కార్యకర్తలకు రక్షణ కల్పిస్తామని జగన్ చెప్పినట్లు సమాచారం. ఈ భరోసాతో పార్టీ శ్రేణుల్లో కొంత ఊరట కనిపిస్తున్నదని అంటున్నారు.ఈ వివాదానికి కారణమైన సంఘటన ఏలూరు జిల్లా గోపాలపురం నియోజకవర్గం లో చోటు చుకుంది. గత నెలలో జగన్ పుట్టినరోజు సందర్భంగా కొందరు వైసీపీ కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అందులో "2029లో అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కడికి రప్పా.. రప్పా" అనే పదాలు ఉండటంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఫ్లెక్సీ ముద్రించిన కార్యకర్తలను అరెస్ట్ చేయడంతో పాటు, ప్రింటింగ్ షాపును కూడా సీజ్ చేసినట్లు వైసీపీ ఆరోపిస్తోంది. అంతేకాదు, నిందితులను బహిరంగంగా రోడ్డుపై నడిపించారని, ఇది ఉద్దేశపూర్వక అవమాన చర్య అని పార్టీ నేతలు మండిపడుతున్నారు.ఇలాంటి ఘటనలు ఒక్క గోపాలపురం వరకే కాకుండా అనంతపురం సత్యసాయి జిల్లాల్లో కూడా చోటుచుకున్నాయని చెబుతున్నారు. అక్కడ కొందరు కార్యకర్తలు కత్తులు ప్రదర్శించడం, జంతు బలులు ఇచ్చి జగన్ పోస్టర్లకు రక్తాభిషేకం చేయడం వంటి ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జంతు సంరక్షణ చట్టాలు, ఆయుధాల చట్టం కింద కేసులు నమోదు చేసి పలువురిని అరెస్ట్ చేసింది. ఈ కేసులలోనూ నిందితులను కోర్టులకు తరలించే సమయంలో రోడ్డుపై నడిపించారని వైసీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.ఈ వ్యవహారంపై జగన్ తీసుకున్న నిర్ణయాన్ని పార్టీ కార్యకర్తలు స్వాగతిస్తున్నారు. తమ అభిమానాన్ని వ్యక్తపరిచినందుకే ప్రభుత్వం అణచివేస్తోందని వారు భావిస్తుండగా, అధినేత నుంచి న్యాయ సహాయం హామీ రావడంతో ధైర్యం వచ్చిందని చెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వ అనుకూల వర్గాలు మాత్రం "రప్పా.. రప్పా" వంటి నినాదాలు ప్రజాస్వామ్య రాజకీయాలకు విఘాతమని, హింసను ప్రోత్సహించేలా ఉన్నాయని విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జగన్ నిర్ణయం రాజకీయంగా, న్యాయపరంగా మరింత పెద్ద చర్చకు దారి తీసినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సాయం కాదు.. బాధ్యత..!

## - మసీద్ నిర్మాణానికి డాన్ సాదిక్ రూ.40, 000 విరాళం అందజేత



**అనంతపురం - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లాలోని గార్లదిన్నె మండలం ఎర్రగుంట్ల గ్రామంలోని మస్జిద్ హసీన నిర్మాణానికి సీనియర్ మైనార్టీ నాయకులు డాన్ సాదిక్ రూ.40,000 వేల రూపాయలు విరాళం అందించి పలువురు మైనారిటీలకు ఆదర్శంగా నిలిచారు. శుక్రవారం నాడు అయన మస్జిద్ ముతవల్లి షేక్ సర్దార్ భాష, ఇమామ్ అష్రఫ్ అలీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... భవిష్యత్తులో మసీదు అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముస్లింల సంక్షమానికి ప్రభుత్వం కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమం లో ముతవల్లిలు ముస్లిం మైనారిటీలు, ముతవల్లిలు తదితరులు పాల్గొన్నారు.

# ఈద్గాలో మంచి నీటి బోరు వేయించిన ఎమ్మెల్యే



**కదిరి - సూర్య వాస్తవం :** పట్టణంలోని ముస్లిం మైనారిటీ ఏ ఈద్గాలో ఎన్నో ఏళ్ళుగా మంచినీటి సమస్య నెలకొన్నాయి, పట్టణంలో ముస్లిం వ్యక్తులు ఎవరైనా కాలం చెల్లిన సమయంలో మట్టి కార్యక్రమం తరువాత కాళ్లు, చేతులు శుభ్రపరిచేందుకుగాను నానాఇబ్బందులు పడేవారు. ఇలాంటి సమయంలో నీటి ఎద్దడి నెలకొందని ఈద్గా పెద్దలు కదిరి శాసన సభ్యులు కందికుంట వెంకటప్రసాద్ కు సమస్యను తెలియజేయగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి బోరును వేయించి సమస్యను పరిష్కరించారు, ఈ సందర్భంగా ఈద్గా ముస్లిం మైనారిటీ పెద్దలు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు, ఈ సందర్భంగా మైనారిటీ పెద్దలు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి ఏ ఒక్కరు అధికారులు ఈ సమస్యను పరిష్కరించలేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లగా సకాలంలో స్పందించి నీటి సమస్యను పరిష్కరించి తాగునీటి సౌకర్యాన్ని కల్పించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు, మైనారిటీల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, కొందరు అసత్య ప్రచారాలను చేస్తున్నారని వాటిని నమ్మ పలకద్దని తెలిపారు, శాసనసభ్యులు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా సత్వర పరిష్కార మార్గాలు చౌరగంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు మాజీ ఎంపీ కర్నల్ నిజాం, సిఎండి ఫరూక్, మండి నజీర్, అబ్దుల్ రబ్, కదిరి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు కేస్ బహావుద్దీన్, ఎస్సీ సెల్ నాయకులు రాజశేఖర్ బాబు ,ఇస్మాయిల్, మహబూబ్ బాషా, ఖాసిం, కౌన్సిలర్ జిలాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు సల్మాన్ కైఫ్, హైదర్, ఖతాబ్, నౌషాద్, సులేమాన్, ఎం ఎన్ విశ్వనాథ్, కరాటే అలీ, అతి హర, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్లు, డ్రైనేజీలకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



**పామిడి- సూర్య వాస్తవం :** పామిడి పట్టణం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం 50 లక్షల రూపాయలతో నూతన సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువ లకు భూమి పూజ, నలంద స్కూల్ వద్ద నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలకు శంకుస్థాపన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు పామిడి పట్టణం అభివృద్ధిలో భాగంగా 50లక్షల రూపాయలతో సిసి రోడ్లు మరియు డ్రైనేజి కాలువల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేయడం జరిగింది. కచ్చితంగా పామిడి పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఒక చారిత్రిక తప్పిదం

## - జీవో 590 చీకటి జీవో ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి



**విజయవాడ - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో పులివెందులతో సహా 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తూ కూటమి ప్రభుత్వం జీవో 590 జారీ చేయడం ఒక చారిత్రిక తప్పిదమని, ఇది చీకటి జీవో అని, ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ న రెడ్డి తులసి రెడ్డి అన్నారు.శుక్రవారం విజయవాడలో ధర్నా చౌక్ వద్ద ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక నిరసన దీక్ష జరిగింది.ఈ దీక్ష కార్యక్రమానికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తరఫున డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి,గిడుగు రుద్రరాజు మస్తాన్ వల్లి నరహరిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు. వైకాపా పార్టీ తరఫున మాజీ మంత్రి పేర్ని నాని,మాజీ శాసనసభ్యులు మల్లాది విష్ణు, సిపిఐ తరఫున జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ,రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, సిపిఎం తరఫున రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు మాజీ మంత్రి వడ్డీ శోభనాధీశ్వరరావు పరిరక్షణ కమిటీ కన్వీనర్ దాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు కోకన్వీనర్ లక్ష్మణరావు,డాక్టర్ వసుంధర,లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు విజయ్ కుమార్వి,వివిధ ప్రజా సంఘాల, యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డాక్టర్ తులసి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం ద్వారా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని,రోగులు ఉచిత వైద్యానికి నోచుకోరని, ప్రతిభకు పాడే కట్టడం, పసిడీకి పట్టాభిషేకం చేయడం జరుగుతుందని అందువల్లనే కాంగ్రెస్ పార్టీ ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నదని అన్నారు.ప్రభుత్వం దగ్గర సరిపడా నిధులు లేని కారణంగా పి పి పి విధానంలో నిర్మించాలనుకున్నామని ప్రభుత్వం చెప్పడం కేవలం సాకు మాత్రమే అన్నారు. 10 మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలో పూర్తి చేయాలంటే కేవలం 6000 కోట్ల రూపాయలు సరిపోతాయి ప్రభుత్వం ఒక సంవత్సరం బడ్జెట్ మూడు లక్షల 22 వేల కోట్ల రూపాయలు.కాబట్టి ఒక సంవత్సరం బడ్జెట్లో ఒక్క శాతం ఖర్చు పెడితే అన్ని ప్రభుత్వ కళాశాలలో పూర్తి అవుతాయి. ఇప్పటికే రుణ సహాయం చేసేందుకు నాబార్డు కూడా అంగీకరించింది భూమి ప్రభుత్వానిది,భవనాలు ప్రభుత్వానివి,ఇవి చాలక రెండు సంవత్సరాలు సిబ్బందికి ప్రభుత్వమే జీతభత్యాలు చెల్లిస్తుందట, ఇంకా అవసరమైతే వయబులిటీ గ్యాప్ పండు కింద నిధులు ఇస్తుందట దీన్ని బట్టి చూస్తే సొమ్మొకడిది సోకొకడిది అన్న సామెత గుర్తుకొస్తుంది.గతంలో వైకాపా ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్సు విధానంలో నిర్వహిస్తామని జారీచేసిన 107,108 జీవోలను వ్యతిరేకించిన కూటమి పార్టీలు ఇప్పుడు మొత్తం ప్రభుత్వ వైద్య కళాశాలలను హెూల్సేల్ గా ప్రైవేట్ పరం చేయడం దురదృష్టకరం. ఇది ప్రభుత్వం యొక్క రెండు నాలుకల ధోరణి తెలియచేస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ వైద్య విద్యలో క్యాపి టేషన్ ఫీజును పూర్తిగా వ్యతిరేకించారని, ఆయన ఆత్మ శాంతికైనా చంద్రబాబు ప్రభుత్వం జీవో 590ని ఉపసంహరించుకోవాలని, పులివెందులతో సహా 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే నిర్మించి నిర్వహించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.లేకుంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలకు భంగపాటు తప్పదని, తస్మాత్ జాగ్రత్త అని తులసి రెడ్డి హెచ్చరించారు.




# మీ భద్రత - మా బాధ్యత

## - కానీ మీ జాగ్రత్త - మాకు అదనపు బలం
## - హెచ్ఎమ్ఎస్ సేవలు సద్వినియోగం చేసుకోండి - డీఎస్పీ మురళి నాయక్



**పులివెందుల - సూర్య వాస్తవం:** మీ భద్రత -- మా బాధ్యత, కానీ మీ జాగ్రత్త - మాకు అదనపు బలం అని సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటిని వదిలి ఊర్లకు వెళ్ళే ప్రజలకు డీఎస్పీ మురళి నాయక్ సూచించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళి పులివెందుల ప్రజలకి పండగ సందర్భంగా ప్రతి ఇంటి యజమాని అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు సలహాలు అందించారు. బలమైన తాళాలు వాడండి - ఇంటి ప్రధాన తలుపులు, వెనుక తలుపులు, బాల్కనీలకు బలమైన తాళాలు వేసి భద్రపరచండి, విలువైన వస్తువులు ఇంట్లో ఉంచవద్దు - నగలు, నగదు, ముఖ్యమైన పత్రాలను బ్యాంక్ లాకర్లో భద్రపరచండి,. ఇంటి గేట్లకు బయట తాళాలు వేయవద్దు - లోపల తాళం వేసుకోవడం మంచిది,సి సి. కెమెరాలు అమర్చండి - మీ ఇంటి ముందు ద్వారం, వెనుక ద్వారం, రెండు ప్రక్కల భాగాల్లో హై రిజల్యూషన్ కెమెరాలు అమర్చండి. ఇంటి చుట్టూ కవరేజ్ వచ్చేలా ఉండాలి. వీటిని మీ మొబైల్ ఫోన్కి కనెక్ట్ చేసి, మీరు ఎక్కడ ఉన్నా పర్యవేక్షంచగలగాలి. అదనంగా అలార్మ్ సిస్టమ్స్ మరియు సెన్సార్ లైట్లు ఏర్పాటు చేయడం మంచిది,ఎల్ హెచ్ ఎమ్ ఎస్ సేవను వినియోగించండి - ఇల్లు ఖాళీ చేసి వెళ్ళే ముందు స్థానిక పోలీస్ స్టేషన్లో హెచ్ ఎమ్ ఎస్ సేవను కోసం నమోదు చేసుకోండి. పోలీసులు వివిధ సమయాల్లో పర్యవేక్షణ చేస్తారు. ఇది ఉచిత పౌర సేవ. అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండండి మీ వీధిలో లేదా ఇంటి దగ్గర పరిచయం లేని వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని అనిపిస్తే వెంటనే ఫోటో తీసి డయల్ 112 లేదా స్థానిక పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వండి. "కావలసినంత అప్రమత్తత - సమర్థ నిఘా" అన్నది ప్రజల భద్రతకు మూలస్తంభం, పొరుగువారితో సమన్వయం - మీరు లేని సమయంలో పక్కింటివారికి సమాచారం ఇవ్వండి, వారు గమనిస్తారు. సోషల్ మీడియాలో జాగ్రత్త - మీరు ప్రయాణంలో ఉన్న విషయం సోషల్ మీడియాలో ఫోటోలను, వీడియోలను షేర్ చేయడం దొంగలకు సంకేతంగా మారుతుంది. "ఇంట్లో ఎవరూ లేరు" అనే సంకేతాన్ని ఇవ్వడం వల్ల మీ ఇంటి భద్రత ప్రమాదంలో పడుతుంది. రాత్రివేళ ఇంటి ముందు భాగం, గ్యారేజ్, ఆవరణలన్నీ వెలుగుతో ఉండేలా చూసుకోండి. చీకటి దొంగలకి అవకాశాన్ని ఇస్తుంది. ఫ్లడ్ లైట్లు, సెన్సార్ లైట్లు అమర్చితే వాటి స్పందన వల్ల దొంగలు భయంతో పారిపోతారు. వీలైతే వాచ్డాగ్స్ లేదా వాచ్మెన్ ను ఏర్పాటు చేసుకోండి. పనివారుల వివరాలు ఉంచుకోండి - మీ ఇంట్లో పని చేసే వ్యక్తుల బయోడేటా, ఫోటోలు, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా సేకరించండి. మీ ఇంటిని కాపాడటానికి మీరు తీసుకునే ఒక్క చిన్న జాగ్రత్త - ఒక పెద్ద నేరాన్ని నివారించగలదు. అందుకే పోలీసుల పిలుపు ప్రకారం, ప్రతి పులివెందుల నియోజకవర్గ పౌరుడు ఈ సూచనలను పాటిస్తూ భద్రతా బాధ్యతలో భాగస్వామిగా మారాలని సూచిస్తూ పండుగ వాతావరణంలో ప్రతి ఒక్కరు సంక్రాంతి సంబరాలు జరుపు కోవాలని ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు డి.ఎస్.పి మురళి నాయక్ తెలిపారు.

# 50 మంది దివ్యాంగులకు నిత్యవసర సరుకుల పంపిణీ

**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట నందుగల రాక్ ప్రార్థన మందిరంలో చర్చినిర్వాహకులు ఆప్రభువు నామమున, 50 మంది అవయవాలులేని దివ్యాంగులకు 50వేల రూపాయలు విలువచేసే బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. అంతకు మునుపు చర్చి ఫాదర్ శారీరక, మానసిక వికలాంగులకు స్వస్థత చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాజంలోని అత్యంత వెనుకబడ్డ అనాథలు, దివ్యాంగుల సంక్షమం కొరకు ప్రత్యేక సేవాకార్యక్రమాలు చేపడుతున్న రాక్ చర్చి ఔన్నత్యాన్ని ప్రశంసిస్తూ, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఈ సందర్భంగా, వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు ఇరికిరెడి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రాక్ చర్చి ఫాదర్, సంఘపెద్దలు, ప్రభువిశ్వాసులు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.



# నేడు గజలక్ష్మీ అలంకారంలో శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** స్థానిక పట్టణంలోని మెయిన్ బజార్లో వెలసియున్న శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసం నాలుగవ శనివారం పురస్కరించుకొని దేవస్థానం ముఖ్య అర్చకులు హరి ప్రవీణ్ ఆధ్వర్యంలో శ్రీ స్వామివారికి తామర పుష్పాలతో లక్ష అర్చన పూజా కార్యక్రమం మహిళలచే సామూహికంగా నేడు ఉదయం 05 గంటల నుండి 6 గంటల వరకు నిర్వహించబడును. తదుపరి ఉదయం 6 గంటల నుండి ధనుర్మాస పూజ కార్యక్రమా లు యధావిధిగా నిర్వహించబడునని, శ్రీ స్వామివారు గజ లక్ష్మీ అలం కారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సదరు లక్షార్చన పూజా కార్యక్రమంలో మహి ళలంతా పాల్గొని శ్రీస్వామివారి కృపాకటాక్షములు పొందవలసినదిగా దేవస్థానం కార్య నిర్వహణాధికారి కే.సుభాష్, దేవస్థానం ఛైర్మన్ పివి.రమణలు తెలిపారు.

# రైతుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

- పీఎండిడికేవై నోడల్ అధికారి బాలమురుగన్
- పీలేరు మండలాన్ని ఆకస్మిక సందర్శన చేసిన పీఎండిడికేవై నోడల్ అధికారి బాలమురుగన్ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం :** రైతుల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన కార్యక్రమాన్ని అమలు చేయాలని పిఎండిడికేవై నోడల్ అధికారి బాలమురుగం పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా నోడల్ అధికారిగా కేంద్ర ప్రభుత్వం చే నియమింపబడ్డ బాలమురుగన్ ఐఏఎస్ తో కలిసి పీలేరు మండలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పీలేరు మండలం గడరేవుపల్లి గ్రామానికి చెందిన కొంతమంది రైతులు మరియు ఎఫ్.పి.ఓ లతో జిల్లా కలెక్టర్ మరియు నోడల్ అధికారి పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ నోడల్ అధికారి బాల మురుగన్ కు అన్నమయ్య జిల్లాలో అమలవుతున్న ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజనపై పలు అంశాలను వివరించారు. జిల్లాలో మామిడికాయలకు కవర్లను సబ్సిడీతో రైతులకు అందించి వాటిని మామిడి పంటకు ఏర్పాటు చేయించడం ద్వారా పంట ఉత్పత్తి మరియు పంట నాణ్యత ఏ విధంగా పెరిగిందో వివరించారు.

అనంతరం ఈశ్వరయ్య అనే రైతు తన వ్యవసాయ భూమిలో పండిస్తున్న మామిడి మిరప మరియు వేరుశనగ పంటలను నోడల్ అధికారికి మరియు జిల్లా కలెక్టర్కు చూపించి తాను ఏ విధంగా మల్టీ క్రాపింగ్ చేస్తున్నాడో వివరించారు. పంటల యొక్కసాగు, ఖర్చు మరియు ఆదాయం గురించి నోడల్ అధికారికి మరియు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం మరో రైతు కృష్ణయ్య సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ మరియు అందులో అంతర పంటగా సాగు చేసిన డేట్ పామ్ తోట ను పరిశీలించారు. పంట సాగు మరియు ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మరియు ఎఫ్పీఓ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయని అడగగా పీలేరులో తమకు మార్కెట్ యార్డును ఏర్పాటు



చేయవలసిందిగా రైతులు కోరారు. ప్రస్తుతం గుర్రంకొండ లేదా మదనపల్లి మార్కెట్ యార్డులకు పోవాలంటే దూరాభారం అవుతుందని పీలేరులో మార్కెట్ యార్డు ఉంటే తమకు అనుకూలంగా ఉంటుందని రైతుల వివరించారు మామిడి పంటకు సూక్ష్మ పోషకాలు అందించగలిగితే పంట బాగా వస్తుందని వారు కోరారు. రైతులు పీఎం డిడి కేవై పథకం కింద మామిడి పంటకి ఫ్రూట్ కవర్లు కావాలని, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజషన్ (ఫ్పీూ)లకి 75 శాతం రాయితీతో కలెక్షన్ సెంటర్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరగా నోడల్ అధికారి ,జిల్లా కలెక్టర్ వాటికి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి బాలమురుగన్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి ఘనధాన్య కృషి యోజన కార్యక్రమాన్ని రైతులకు ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా అమలు చేయాలని సూచించారు. పంటలకు ఇచ్చే బీమా, టమాట ప్రాసెసింగ్, తదితర అంశాలపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ ఉద్యానవన మరియు సూక్ష్మ నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు.

ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన కార్యక్రమానికి సంబంధించి అన్నమయ్య జిల్లా వ్యవసాయ ఉద్యానవన మరియు సూక్ష్మ నీటిపారుదల శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి శివ నారాయణ, జిల్లా ఉద్యాన అధికారిని సుభాషిణి, జిల్లా సూక్ష్మ నీటి అధికారిని లక్ష్మ ప్రసన్న, జిల్లా పశు వైద్య అధికారి గుణశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ





**గాండ్లపెంట - సూర్య వాస్తవం :** గాండ్లపెంట మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ భూమి పూజ చేశారు. రెక్కమాను నుంచి వెలిచెనుమల వరకు రూ.3 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, మండల కేంద్రంలోని సీసీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి భూ సమస్యలకు సంబంధించిన పలువురు వినతులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ బాబురావు, ఎంపిడివో రామకృష్ణ, మండల టిడిపి నాయకులు అప్పిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, దొనకొండ ఆనంద్, చిన్నోడు, రామాంజులు రెడ్డి అక్రమ్ భాష తదితరులు పాల్గొన్నారుదు

## 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత





**రాయచోటి - సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సంబేపల్లి మండలం ఎస్టియు శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్టీయూ అకాడమిక్ కమిటీ రూపొందించిన ఎస్ ఎస్ సీ స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ప్రభుత్వ అధికారులచే అందజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంబేపల్లి నందు మండల తాసిల్దార్ సుబ్రమణ్యం రెడ్డి, మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మరియు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ఎస్టియు సంఘం ముందుకు రావడం హర్శించదగ్గ విషయమని రానున్నన్న పరీక్షలు వ్రాయబోయే విద్యార్థులకు ఈ మెటీరియల్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని దీనిని మండలంలోని ప్రతి విద్యార్థి వినియోగం చేసుకొని మంచి మార్కులు సాధించాలని వారు కోరారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలోనే 250 మంది విద్యార్థులకు 20వేల రూపాయలు హెచ్చించి అందజేస్తున్నామని , ఈ మెటీరియల్ నుండే గత సంవత్సర పబ్లిక్ పరీక్షల కు రావడం జరిగింది దీనిని గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మరింత ఎక్కువ విద్యార్థులకు ఉపయోగపడేటట్టు రాష్ట్రంలోని నిష్ణాతులైన విషయ నిపుణులు చే తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంకం శివారెడ్డి పాఠశాలప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, సీనియర్ నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి డివిజనల్ కన్వీనర్ మురళి కుమార్, వెంకటయ్య, ప్రభాకర్ దామోదర్ రెడ్డి, పాపిరెడ్డి వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మారెమ్మ గుడికి రూ.20,016 విరాళం



**గాండ్లపెంట - సూర్య వాస్తవం :** గాండ్లపెంట మండలం లోని తుమ్మలబైలు పంచాయతీలో ఉన్న గరుగుతాండ గ్రామం లోని మారెమ్మ గుడికి రూ. 20016 కటారుపల్లి వేమన పీఠాధిపతి అయిన నంద వేమారెడ్డి అందజేశారు.అదేవిధంగా ఆయన గ్రామం లో చాలా విదంగా తనకు తోచిన సహాయం చేస్తున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## బొల్లు రామ్మోహన్‌ను సన్మానించిన బలిజ సంఘం నాయకులు



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** అమరావతిలోని సత్యసాయి సిరిచువల్ ఆవరణలో కరుణ శ్రీ వేదికపై నిర్వహించిన మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రశంస పత్రము బంగారు మెడల్ పొందిన కవి రచయిత బ్రహ్మంగారిమఠం బలిజ కాపు, తెలగ, అన్నదాన సత్రం కార్యదర్శి బొల్లు రామ్మోహన్ ను బ్రహ్మంగారిమఠం బలిజ అన్నదాన సత్రం ప్రాంగణంలో బలిజ కాపు తెలగ అన్నదాన సత్రం మాజీ అధ్యక్షులు శ్రీరాములు, ఉప అధ్యక్షులు సిగినేని వెంకటరమణయ్య, అంకాలుగారి రామయ్య,ఉప కార్యదర్శి దరిమిశెట్టి రమణయ్య, కోశాధికారి ఆకుల కొండయ్య, కమిటీ సభ్యులు కోనేటి వెంకటసుబ్బయ్య, గోశెట్టి రామమూర్తి, అంబిశెట్టి వెంకటసుబ్బయ్య రాయల్ (విలేఖరి), మేనేజర్ రవి రాయల్ ఆకులవీరయ్య కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

## కబడ్డీ టోర్నమెంట్ బృందంకు విరాళం

### - అందజేసిన వాల్మీకి సంఘం అధ్యక్షులు



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి కిష్టప్ప కబడ్డీ టోర్నమెంట్ బృందం సభ్యులకు విరాళం అందించారు. శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని లక్ష్మ బజార్ లో ఉన్న హనుమాన్ టెక్స్టైల్స్ భవనంలో ఆ సంక్షమ సేవా సమితి ఉపాధ్యక్షులు మలకన్న, సభ్యులతో కలిసి వాల్మీకి సంక్షమ సేవా సమితి తరపున విరాళం ఇచ్చారు. రాయదుర్గం ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ కబడ్డీ బృందం సభ్యులు వాల్మీకి సంక్షమ సేవా సమితి అధ్యక్షులను కలుసుకొని కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహణ విషయమై వివరించగా అందుకు సమ్మతించిన ఆయన రూ. 10100లు విరాళం వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కబడ్డీ క్రీడలో రాణించి విజయం సాధించి రాయదుర్గంకు మంచి పేరు గడించాలని త్వరలో అందుకున్న కబడ్డీ బృందం సభ్యులకు సూచించారు. క్రీడలతో గుర్తింపు లభిస్తుందని తాలూకా స్థాయి నుండి రాష్ట్రస్థాయి, దేశ స్థాయిలో యువకులు క్రీడల్లో పాల్గొని తమ సత్తాను చాటి జన్మనిచ్చిన జన్మభూమి రుణం తీర్చుకోవాలని ఆయన యువకులకు తెలిపారు. క్రీడలకు వాల్మీకి సంక్షమ సేవా సమితి ఆధ్వర్యంలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన క్రీడా బృందం సభ్యులకు చెప్పారు. తాము అడిగిన తక్షణం టోర్నమెంట్ నిర్వహణకు విరాళమిచ్చి తమను ప్రోత్సహించినందుకు కబడి ఓపెన్ టోర్నమెంట్ బృందం సభ్యులు వాల్మీకి సంక్షమ సేవా సమితి అధ్యక్షలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంక్షమ సేవాసమితి యూత్ సభ్యులు హరీష్ కుమార్, నరేంద్ర, మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, బోయపాటి ప్రకాష్, సభ్యులు అజయ్ టైలర్ రఘు, పై తోట శ్రీనివాసులు, రుద్ర, ప్రశాంత్, మిత్రులు న్యాయవాది సూర్యజాన్సన్ పాల్గొన్నారు.

## గర్భిణులకు బాలింతలకు పౌష్టికాహారం

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుండి ప్రతి నెల 9వ తేదీన మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే గర్భవతులకు బాలింతలకు వైద్య పరీక్షలకు వచ్చే వారి ఆకలి కడుపుతో ఇంటికి వెళ్లకూడదని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు పౌష్టికాహారం (భోజన సదుపాయం)అందజేస్తున్నట్లు మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు, డిప్యూటీ డిఎంహెచ్ఓ మల్లేష్, డాక్టర్ సంపత్ కుమార్ వైద్యశాలకు వచ్చిన గర్భిణులకు బాలింతలకు పౌష్టికాహారం వారు వడ్డించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎం హెచ్ఓ మాట్లాడుతూ గర్భిణులకు బాలింతలకు బ్రహ్మంగారి ఆలయం నుండి పౌష్టికాహరం (భోజన సదుపాయం) ఏర్పాటు చేయడం మంచి సంతోష తగ్గ విషయమని మఠం యాజమాన్యానికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ





**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బుక్కరాయసముద్రంలో "ప్రధానమంత్రి సురక్షత మాతృత్వ అభయాన్ " కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్నటువంటి హైరిస్క్ గర్భవతులకు చికిత్స, పరీక్షలు, సలహాలు, మందులు తదితర వాటినే వారికి అందజేసి చికిత్స చేశారు. ఈ కార్యక్రమం జరుగుతున్నప్పుడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈవీ దేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ జరుగుతున్నటువంటి గర్భవతుల నమోదు, వారికి అందిస్తున్న వైద్య సేవలు,చికిత్స విధానం, పరీక్షలు తదితర వివరాలు పరిశీలించి తగు సూచనలు చేసి గర్భవతుల మాతృత్వ మరణాలు శిశు మరణాలు ఎట్టి పరిస్థితుల లోనూ జరగకుండా జాగ్రత్తలు చెప్పి సురక్షత ప్రసవం అయ్యేట్టుగా అన్ని రకాల చర్యలు తీసు కోవాలని వైద్యాధికారి డాక్టర్ స్వాతి లక్ష్మిని ఆదేశించారు. అలాగే ప్రతి నెల ఈ కార్యక్రమం రోజు పసుపుల బ్రదర్స్ భోజన సదుపాయం గర్భవతులకు కల్పించడం జరుగుతుందని విషయం తెలిపిన వెంటనే డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఈ బీ దేవి అక్కడికి చేరుకొని గర్భవతులకు భోజనాన్ని వడ్డించి పరిశీలించింది. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ స్వాతి లక్ష్మ మరియు డాక్టర్ తెహరున్నీసా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మోహన్ రావు సూపర్వైజర్లు విజయలక్ష్మ, పీహెచ్ఎన్ లు సుజాత, నాగలక్ష్మ ఫార్మసిస్టు మహబూబ్ ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు తదితర క్షత్రస్థాయి సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో స్కూటర్ రైడర్ మృతి

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** రాయచోటి పట్టణంలోని గాలివీడు రింగ్ రోడ్డు, ఆంధ్ర స్పైస్ హొటల్ సమీపంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కర్నూలు బస్సు ప్రమాదాన్ని తలపించే రీతిలో జరిగిన ఈ ఘటనలో స్కూటర్‌పై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

ప్రమాద సమయంలో స్కూటర్‌లో ఉన్న పెట్రోల్ చిందరబడడంతో అగ్నిప్రమాదం కూడా చోటుచేసుకున్నట్లు సమాచారం. దీంతో ఘటన స్థలంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.







## జేఎన్టీయూఏ పరీక్ష ఫలితాలు విడుదల

**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం జేఎన్టీయూ పరిధిలో నిర్వహించిన బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఫార్మసీ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ శివకుమార్ ఈ ఫలితాలను ప్రకటించారు. విద్యార్థులు ఫలితాల కోసం https://jntuaresults.ac.in/ 3 సందర్శించాలని అధికారులు సూచించారు.

## రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలి

### - కొనసాగుతున్న దీక్షలు




**రాయచోటి – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని నియోజకవర్గాలలో పూర్తిగా వెనుకబడిన వర్గం రాయచోటి నియోజకవర్గం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని మరో ప్రాంతానికి తరలించడం చాలా బాధాకరమైన విషయం. ఆనాటి నుండి ఈనాటి వరకు నియోజకవర్గానికి మంజూరైన సైనిక్ స్కూల్, రైలు మార్గం, ఆయుష్ మెడికల్ కాలేజ్ లను రాష్ట్రంలో పలుకుబడి ఉన్న పెద్దపెద్ద నాయకులు గద్దల్లా తన్నుకుపోవడం చాలా బాధాకరం. మంజూరైన సంస్థలను తో నిలబెట్టుకోగల నాయకులు లేకపోవడంతో అన్నమయ్య జిల్లా కేంద్రంగా గల రాయచోటి కూడా తరలిపోవడం మరింత ఆవేదనకు గురయ్యారు. కనుక రాయచోటిని ప్రత్యేకంగా జిల్లాగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గత మూడు రోజులుగా చేస్తున్న సామూహిక నిరాహార దీక్షలను కాంగ్రెస్ పార్టీ నేతలు అమీర్, మన్సూర్, ఐ.యు.ఎం. అధ్యక్షుడు షపాబుల్ భాషలు అన్నారు. ఈ దీక్షలకు హెూటల్ యజమాని గఫూర్, వ్యాపారవేత్తలు మహబూబ్ బాషా, అనిల్ కుమార్, ఎలక్ట్రికల్ యూనియన్ ప్రెసిడెంట్ అస్లాం, ముస్లిం ఐక్యవేదిక సభ్యులు నౌషాద్, ఆర్ట్స్ అసోసియేషన్ తరుపున గౌస్, రాజు తదితరులు తమ మద్దతులను తెలియజేశారు. కార్యక్రమంలో కొలువులు పాల్గొన్నారు.

## తెలుగువారి ఆత్మీయ పండుగ సంక్రాంతి



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** తెలుగువారి ఆత్మీయ పండుగ సంక్రాంతి అని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వరాల రమేష్ అన్నారు. ముందస్తు సంక్రాంతి సంబరాలలో భాగంగా గురువారం ఏపీ మోడల్ స్కూల్లో గ్లోబల్ పబ్లిక్ స్కూల్ మనిషా విద్యానికేతన్ హై స్కూల్ నందు రంగవల్లి ముగ్గులు వేసి భోగిమంటలు వేసి విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగువారి సాంప్రదాయ పండుగ సంక్రాంతికి నూతన వస్త్రాలు ధరించి ప్రతి ఒక్కరూ ఆడపడుచులు పుట్టింటికి వెళ్లడం గోవులను పూజించడం గంగిరెద్దులు రావడం ఎన్నో కార్యక్రమాలు పండగ రోజు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, గ్లోబల్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ దాక్షయని మనీషా విద్యానికేతన్ హై స్కూల్ హెచ్ఎం చైతన్య రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండగకు ఊరు వెళ్తున్నారా.. జర భద్రం




**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** ఏడాదికి ఒకసారి వచ్చే తెలుగు సాంప్రదాయ పండుగ సంక్రాంతి పండగకి ఊరికి వెళ్తున్నారా ఇంటికి లాక్ వేసి జాగ్రత్తగా చూసుకొని వెళ్లాలని ఎస్సై డి శోభ పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండక్కు ఊరికి పల్లెలకు వెళ్ళేవారు ఇంట్లో బంగారు నగలు ఉంటే వాటిని బ్యాంకుల లాకర్లో భద్రపరచుకోవాలన్నారు. ఊర్లకు వెళ్లేప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలన్నారు. విలువైన వస్తువులు సమాచారాన్ని వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదన్నారు. ద్విచక్ర వాహనాలు కారులను ఇంటి ఆవరణంలోనే పార్కింగ్ చేయాలని రోడ్లపై నిలపరాదన్నారు. ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్ తో పాటు చక్రాలకు కూడా లాక్ వేస్తే మంచిదన్నారు. ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టింగ్ సీసీ కెమెరాలు ఏర్పరచుకోవడం మంచిది అన్నారు. సీసీ కెమెరాలను ఇంటర్నెట్‌కు అనుసంధానం చేస్తే మొబైల్ నుంచి మీ ఇంటిని ఎక్కడి నుంచైనా ప్రత్యక్షంగా చూసుకోవచ్చున్నారు. ఈ జాగ్రత్తలు తీసుకొని పండగలకు వెళ్లాలన్నారు.

# పురిటి బిడ్డను పారేసిన కసాయి తల్లి







**మదనపల్లె – సూర్య వాస్తవం:** మదనపల్లె పట్టణం బాలాజీ నగర్‌లో శుక్రవారం అమానుష ఘటన వెలుగు చూసింది. తీవ్ర కలకలం రేపుతున్న ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అప్పుడే పుట్టిన పురిటి బిడ్డ (ఆడ శిశువు)ను ఓ కసాయి తల్లి పారేసి, పేగు బంధాన్ని తెంచుకుని వెళ్లిపోయింది. బాహ్య ప్రపంచంలోకి వచ్చి రాకనే ఆ బిడ్డ తనకేంటి ఇంత ఖర్మ వచ్చిందని ఆపకుండా గుక్క పెట్టి ఏడుస్తుంటే స్థానికులు గుర్తించారు. వెంటనే టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన కానిస్టేబుల్ మధుకర్ వెళ్లి పేగు కూడా ఊడని ఆ పసికందును ఎత్తుకుని చుట్టు పక్కల విచారించారు. ఆ బిడ్డను వదిలి వెళ్లిన ఆ కసాయి తల్లి ఎవరన్నది తెలియ రాలేదు. ఉదయం 4:30 గంటల సమయంలో పురిటి బిడ్డను వదిలివెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. గజ గజ వణికిస్తున్న చలిలో ఆ బిడ్డ విలపిస్తుంటే చూడలేక స్థానికంగా ఉన్న ఓ మహిళ మనసు చలించింది. కానిస్టేబుల్‌ను అడిగి ఐసిడిఎస్ అధికారులు వచ్చే వరకు ఆ బిడ్డను తన వద్దనే ఉంచుకుంటానని అక్కున చేర్చుకుంది. రెండో పట్టణ పోలీసులు ఐసిడిఎస్ అధి కారిణి నాగవేణికి సమాచారం అందించడంతో అంగన్వాడీ కార్యకర్త పోలీసులతో అక్కడికి వెళ్లి బిడ్డను స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. సూపర్వైజర్ కళావతి, శిశుగృహ మేనేజర్ సుప్రియ ఆస్పత్రికి చేరుకున్నారు. పరీక్షించిన వైద్యులు బిడ్డ క్షమంగా ఉన్నట్లు తెలియజేయడంతో ఉన్నతాధికారుల సలహా మేరకు పురిటిబిడ్డ ను చిత్తూరు లోని శిశుగృహకు తరలించారు. బిడ్డ ను కని పారేసిన తల్లికి కోసం పోలీసులు విచారణ చేస్తున్నారు.

### ఆడబిడ్డ అనీ... లేక వదిలించుకోవాలకున్నారా

పుట్టింది ఆడబిడ్డ కావడంతో ఆ కారణంతో వదిలించుకున్నారా లేక అక్రమ సంతానం, మరేదైనా కారణమా అన్నది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది.

## ప్రసన్న వెంకటేశ్వర స్వామి

# ఆలయ పునర్నిర్మాణ పనులను చేపట్టండి

### - దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి



**రాయదుర్గం – సూర్య వాస్తవం:** రాయదుర్గం పట్టణంలోనీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రహరి, ఇతర పనులను త్వరగా పూర్తి చేయించాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. విజయ వాడలో శుక్రవారం సాయంత్రం ఆయన ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ హరి జవహర్ లాల్ ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రాచీనమైన ఆలయాలలో ఒకటైన ఈ గుడిని మన రాష్ట్ర ప్రజలే కాక ఇతర రాష్ట్రాల భక్తులు కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారనీ వివరించారు. ఆలయ ప్రాకార నిర్మాణం కోసం గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం రూ. 2.65కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు 2024 జూన్‌లో కాంట్రాక్టరుతో ఒప్పందం కుదిరిందన్నారు. ఇప్పటి వరకు ఫౌండేషన్, రెండు వరుసల ప్రాకారం పనులతో కలిపి సుమారు 40శాతం పూర్తి అయ్యాయని వివరించారు. అయితే "శ్రీ వాణి పథకం" కింద గతంలో చేపట్టిన పనులను సాంకేతిక కారణాలతో ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడక ముందే ఈ ఆలయ పనులు ప్రారంభమైనందున, సదరు ఉత్తర్వులు దీనికి వర్తించబోవన్నారు. వినియోగ ధృవీకరణ పత్రం, ఎం బుక్, అడ్వాన్స్ స్టాంప్ రసీదు ఇప్పటికే సంబంధిత అధికారులకు సమర్పించబడ్డాయని తెలియజేశారు. ఈ ఆలయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యత, ప్రజల భక్తి విశ్వాసాలను దృష్టిలో ఉంచుకుని ప్రాకారం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం వెంటనే పనులు కొనసాగించేలా చూడాలని విన్నవించారు.

## రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి విస్తృత పర్యటన





**రాయదుర్గం– సూర్య వాస్తవం:** పట్టణంలోని విస్తృతంగా రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి పర్యటించారు. రాయదుర్గం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి, శివారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, బిజెపి నాయకులు పట్టణంలో పర్యటించారు. అనంతరం క్యాలెండర్లను రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి బిజెపి నాయకులకు క్యాలెండర్లను బహుకరించారు.

## మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**సింహాద్రిపురం –సూర్య వాస్తవం :** సింహాద్రిపురం మోడల్ ప్రైమరీ స్కూల్‌లో సంక్రాంతి సందర్భంగా ముందస్తు సంక్రాంతి వేడుకలను ప్రధానోపాధ్యాయులు రామ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులతో పాఠశాల ప్రాంగణం భారతీయ సంప్రదాయం ఉట్టిపడే విధంగా అలంకరణతో ముగ్గులు, భోగి మంటలు, అలాగే పండుగ సంస్కృతి కళ్లకు కట్టినట్లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశ్వత్ రెడ్డి, రాజేశ్వరి, యాస్మిన్, లక్ష్మ, అమర్నాథ్ రెడ్డి ,విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.




# కెరీర్ యాక్టివిటీ ఎక్స్ పో ఎగ్జిబిషన్ విజయవంతం

**అనంతపురం – సూర్య వాస్తవం:**

అనంతపురంలోని జే.ఎన్.టీ.యూలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కెరియర్ యాక్టివిటీ ఎక్స్ పో, ఎగ్జిబిషన్ విజయవంతంగా ముగిసింది. జిల్లాలోని 31 మండలాల ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు మూడు థీమ్ లలో తాము రూపొందించిన నమూనాలు ప్రదర్శించారు. ముఖ్యంగా మై కెరీర్–మై ఫ్యూచర్, మై కెరియర్ మోడల్, ప్రొఫెషనల్ డ్రెస్ కాంపిటీషన్ కు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దాదాపు 150 మంది తమ ఆలోచనలకు ఆకృతినిచ్చి వాటిని ప్రదర్శించారు. అవి పనిచేసే విధానాన్ని చక్కగా వివరించారు. ఏయే రంగాల్లో ఎటువంటి ఉపాధి అవకాశాలు ఉంటాయనే వివరాలు వెల్లడించారు. అందుకు ఏ కోర్సులు చేయాలో కూడా విశదీకరించారు. వివిధ రంగాలలో ఉండే ఉపాధి అవకాశాలను వివరించడానికి 21 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో హెూటల్ మేనేజ్మెంట్, బ్యాంకింగ్, రోడ్సెట్, ప్రభుత్వ ఆసుపత్రి, ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర సంస్థలు పాల్గొని వారి వారి రంగాలలో ఉన్న ఉపాధి అవకాశాలను సందర్శకులకు వివరించారు. ఎక్స్ పోను తిలకించడానికి స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కేజీబీవీల నుంచి వెయ్యి మంది దాకా విద్యార్థులు, టీచర్లు తరలివచ్చారు. అన్ని స్టాళ్లను జీసీడీఓ కవిత, రతన్ టాటా ఇన్నోవేషన్ ఇంక్యూబేషన్ ఎగ్జిక్యూటివ్ ఎం.సమీరా బాను ఓపిగ్గా చూసారు. నమూనాల పని తీరును అడిగి తెలుసుకున్నారు. పిల్లలందరినీ అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ డాక్టర్ హఫీజ్ బాషా ఎంపిక చేసిన ప్రాజెక్ట్ లకు సంబంధించిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. రాష్ట్ర పరిశీలకుడు డా.చాయేంద్ర, ఎస్.ఎస్.ఏ అధికారులు నారాయణస్వామి, వేణుగోపాల్, ఎన్.జీ.సీ రీజినల్ కో ఆర్డినేటర్ ఆనంద భాస్కర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ సైన్స్ సెంటర్ క్యురేటర్ బాలమురళీ, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ నరసింహారెడ్డి, సమగ్ర శిక్ష సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



## అప్పుల్లో కూరుకుపోయిన
# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఫ్యాక్టరీ దుమ్ముధూలితో రైతులకు పంటల నష్టం
- ఆయతపల్లి, ఉడే గోళం రైతులను ఆదుకోండి
- ఏపీ రైతు సంఘం, సీపీఐ



**రాయదుర్గం – సూర్య వాస్తవం :** రాయదుర్గం పట్టణం సరిహద్దులో ఉన్నటువంటి. రాయంపల్లి ఫ్యాక్టరీ సిద్దేశ్వర స్టీల్ ఐరన్ పరిశ్రమ నుండి రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఉడేగోళము. ఆయతపల్లి. బీసీ కాలనీ రైతులను ఆదుకోవాలి. వీరు అనేకసార్లు ఫ్యాక్టరీ యాజ మాన్యంతో చర్చల కోసం వెళ్లి తమ ఫ్యాక్టరీ వల్ల వచ్చు దుమ్ము ధూళి వల్ల నష్టపోతున్నాము మాకు ఏదైనా నష్టపరిహారం చెల్లించమని అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడి వారిని ఆ ఫ్యాక్టరీ నుంచి దొబ్బి వేయడం వారితో ఆ సభ్యకరంగా మాట్లాడడం మీ దిక్కున వారికి చెప్పుకోండి అనే విధంగా ప్రవర్తిస్తున్నారు కావున ఫ్యాక్టరీ యజమాన్యం రైతులతో మాట్లాడి వాళ్ళ సమస్య పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం సిపిఐ గా తెలియజేస్తున్నాము. నేడు రైతుల పరిస్థితి స్థితిగతులు చూడడానికి ఏపీ రైతు సంఘం సిపిఐ పార్టీ అక్కడికి వెళ్లి పరిశీలన చేయడం జరిగింది . అందులో భాగంగా అక్కడ పరిస్థితి చూస్తా ఉంటే చాలా బాధాకరం. విలువైన పంటలు పెట్టుకున్నారు.రైతులు ఎకరాకు 50 వేల నుండి 70000 వరకు పెట్టుబడి పెట్టి పంట వచ్చే సమయానికి పంటలన్నీ నాశనమై రైతులకు కన్నీరే మిగులుస్తోంది. అక్కడ పండించే రైతులు అరటి పంటలు మొక్కజొన్న.దానిమ్మ ఆకతోట. బొప్పాయి ఇతరత్రా పంటలు పండించి జీవనం సాగే పరిస్థితి అప్పులు చేసి



పంటలు పెట్టిన పరిస్థితి మరి రాను రాను పంటలు దిగబడి రావడకపోవడము వచ్చిన పంటలు మార్కెట్ కి వెళితే రేటు పలకకపోవడము ఇవన్నీ కూడా పరిశ్రమ నుంచి కాలుష్యం వల్ల జరుగుతా ఉన్నాయి మరి ఈ వీధి పరిష్కారం చేయడానికి యాజమాన్యం మాత్రం ముందుకు రావడం లేదు కావున సిపిఐ పార్టీ రైతు సంఘంగా ఒకటే చెబుతా ఉన్నాము రైతులను దృష్టిలో పెట్టుకుని రైతులకు పంట నష్టపరిహారం కింద ఎగరాకు 50 వేల రూపాయలు ఇవ్వాలని చెప్పి ఏపీ రైతు సంఘం సిపిఐ గా డిమాండ్ చేస్తున్నాం. లేని సమయంలో స్థానిక రైతులను ఇతర రైతు సంఘాలను కౌలు రైతు సంఘాలను. వ్యవసాయ కార్మిక సంఘాలను కలుపుకొని సమస్య పరిష్కారం కొరకు పెద్ద ఎత్తున పోరాటం చేస్తానని చెప్పి తెలియజేస్తున్నాము ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాయదుర్గం నియోజకవర్గ కార్యదర్శి ఎం నాగార్జున ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి వ్యవసాయ కార్మిక సంఘం తేజ, ఎమ్మార్పీఎస్ స్వామి రైతులకు మద్దతు తెలిపారు రైతులు వై మోహన్ గురు సిద్ధ స్వామి, రాజు, ఊలెప్ప.శివన్న సుధీర్.మంజు సీనా జయన్న తిప్పేస్వామి లింగన్న తదితరులు పాల్గొన్నారు.

# అత్యుత్తమ పోలీస్‌స్టేషన్‌గా పెద్దకడుబూరు

- జాతీయస్థాయిలో గుర్తింపు
- రాష్ట్రంలోనే టాప్‌గా నిలిచిన పోలీస్ స్టేషన్



**కర్నూలు క్రైమ్ – సూర్య వాస్తవం :** కర్నూలు జిల్లా పోలీస్‌శాఖకు గర్వకారణంగా పెద్దకడుబూరు పోలీస స్టేషన్ నిలిచింది. 2025 సంవత్సరానికి గాను రాష్ట్రంలోనే అత్యుత్తమ పోలీస్‌స్టేషన్‌గా పెద్దక డుబూరు ఎంపికై, కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ప్రకటించిన సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును అందుకుంది. దేశవ్యాప్తంగా ఎంపికైన పది పోలీస్‌స్టేషన్‌లలో ఒకటిగా నిలవడం విశేషం కాగా, రాష్ట్రం నుంచి ఈ ఘనత సాధించిన ఏకైక స్టేషన్ ఇదే కావడం మరింత ప్రత్యేకతను సంత రించుకుంది. శుక్రవారం విజయవాడ మంగళ గిరిలోని ఏపీ హెడ్‌క్వార్టర్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, కోసిగి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.ఏ. మంజునాథ్, పెద్దక డుబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి అవార్డును స్వీకరించారు. డీజీపీ జిల్లా పోలీస్‌యంత్రాంగాన్ని అభినందిస్తూ, ఆధునిక సాంకేతికతను వినియోగించి లా అండ్ ఆర్డర్‌ను మరింత పటిష్టంగా నిర్వహించాలని సూచించారు.

ఈ అవార్డు వెనుక ఉన్న కారణాలను వివరిస్తూ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, నేరాల అదుపు, నేర నియంత్రణలో తీసుకున్న కఠిన చర్యలు, సీసీ కెమెరాల విస్తృత వినియోగం, కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయడం వంటి అంశాలు పెద్దకడుబూరు పోలీస్‌స్టేషన్‌ను ముందువరుసలో నిలి పాయన్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా సమర్థవంతమైన పర్యవేక్షణ, నిరంతర గస్తీ, నేరస్తులపై కఠిన చర్యలు చేపట్టడం ద్వారా పోలీస్‌స్టేషన్ విశ్వసనీయతను పెంచగలి గిందన్నారు. పెద్దకడుబూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నివారణలో చూపిన చురుకుదనం, కేసుల పరిష్కారంలో సాధించిన వేగం, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవ హరించిన తీరు ఈ గుర్తింపుకు బలమైన పునాది అయ్యాయి. ఆధునిక సీసీ కెమెరాల వ్యవస్థతో పాటు సాం కేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా నేరాలను ముందుగానే గుర్తించి అడ్డుకునే విధానాలు ఫలితాన్నిచ్చాయన్న విశ్లేషణలు విని పిస్తున్నాయి. ఈ విజయం ఒక్క వ్యక్తి కృషి ఫలితం కాదని, సమష్టి ప్రయత్నాల ద్వారానే సాధ్యమైందని జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన అధికారులు, సిబ్బంది అందరి సహకారంతోనే ఈ జాతీయ స్థాయి గుర్తింపు సాధ్యమైందన్నారు. పెద్దక డుబూరు పోలీస్‌స్టేషన్‌కు లభించిన ఈ గౌరవం కర్నూలు జిల్లా పోలీస్‌శాఖ ప్రతిష్టను జాతీయ స్థాయిలో మరింత పెంచింది. జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మిగనూరు డీఎస్పీ, కోసిగి సీఐ, పెద్దకడుబూరు ఎస్ఐతో పాటు సిబ్బందికి పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా పోలీస్ యంత్రాంగం అభినందనలు తెలిపారు. ఈ అవార్డు భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయడానికి ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# అంగరంగ వైభవంగా సంక్రాంతి వేడుకలు

- ముగ్గులు గొబ్బెమ్మలతో అలరించిన శ్రీ చైతన్య పాఠశల



**పామిడి – సూర్య వాస్తవం:** స్థానిక పామిడి పట్టణంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు ముందస్తు సంక్రాంతి వేడు కలను పాఠశాల యాజమాన్యం ఘన ంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం అంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ సంద్ర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి తెలుగు వారి సంస్కృతి-సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శ నలు, పాటలు, ప్రసంగాలు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీలు ప్రత్యేక ఆక ర్షణగా నిలిచాయి. హరిదాసు-గంగిరెద్దుల వేషధారణ, పాలు పొంగించడం, భోగి మంటలు, గొబ్బెమ్మల పాటలు సంక్రాంతి పండుగ విశిష్టతను చాటిచెప్పాయి. విద్యార్థులకు సంప్రదాయాలపై అవగాహన పెంపొందిం చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సీఈవో సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగు వారి సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి తెలియజేసే తొలి పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సంస్కృతి పట్ల గౌరవం పెరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.రమణా రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని ముందస్తు సంక్రాంతి వేడుకలను విజయవంతంగా ముగించారు.

**తొండూరులో....**

తొండూరు మండలం సంతకొవ్వూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం సంప్రదాయ రంగులతో కళకళలాడింది. విద్యార్థులు రంగవల్లులు (ముగ్గులు) వేసి సంక్రాంతి శోభను ప్రతిబిం బించారు. బోగి పండుగను గుర్తు చేస్తూ బోగి మంటలు వెలిగించి, వాటి చుట్టూ విద్యార్థులు ఆనందంగా నృత్యాలు చేశారు. బాలికలు సంప్రదాయ వస్త్రధారణలో ఉత్సాహంగా పాల్గొనగా, బాలురు గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే వేషధారణతో ఆకట్టుకున్నారు. ఒక విద్యార్థి హరిదాసు వేషధారణలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మన సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడం, పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడం లక్ష్యంగా ఉపాధ్యాయులు తెలిపారు. సంక్రాంతి సంబరాలు విద్యార్థులకు ఆనందం, ఉత్సాహాన్ని కలిగించాయని తల్లిదండ్రులు, గ్రామస్థులు ప్రశంసించారు.



# ముందస్తు సంక్రాంతి సంబరాలు

## - బహుమతులు అందజేసిన యూట్యూబర్ హరి



**పులివెందుల – సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని శ్రీరామ హాల్ రోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను శుక్రవారం పులివెందుల హరి యూట్యూబ్ ఛానల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు రకరకాల ముగ్గులను వేశారు. ఈ ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా డాక్టర్ గంగాదేవి హాజరై విద్యార్థినిలు వేసిన ముగ్గులను పరిశీలించి మొదటి విజేత, రెండో విజేత, మూడో విజేతలను ఆమె ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజులపాటు బంధువులతో స్నేహితులతో ఈ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకుం టామన్నారు. గ్రామాలలో ఎంతో సాంప్రదాయబద్ధంగా ఈ పండుగను జరుపుకు ంటారన్నారు. ఈ సందర్భంగా పులివెందుల హరి యూట్యూబ్ ఛానల్ వారికి కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ బాల నారాయణ, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మా ఊరి సినిమా, రిచ్ కిడ్ సినిమా, ప్రొడ్యూసర్ మంజునాథ్ రెడ్డి, పులివెందుల హరి, మాచిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, మురళిలు వారికి బహుమతులను ప్రదానం చేశారు.

## శ్రీ చైతన్య హైస్కూల్‌లో ...





**వేంపల్లె – సూర్య వాస్తవం :** స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో అంగ రంగ వైభవంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) వెంకట రామిరెడ్డి హాజరై కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారులు మరియు విద్యార్థులు సంప్రదాయ దుస్తులు, వేషధారణలతో పాల్గొని సంక్రాంతి పండుగకు మరింత శోభను తీసుకువచ్చారు. ముఖ్యంగా గంగిరెద్దు వేషధారణ, సోదీ చెప్పు వేషధారణ వంటి సాంప్రదాయ వేషధారులు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఎంఈఓ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ యొక్క ప్రాముఖ్యత, సంప్ర దాయాలు, భారతీయ సంస్కృతి విలువలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యా ర్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, వారి సంప్రదాయ వేషధారణ తనను ఎంతో ఆకట్టుకున్నదని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆహ్వా నించిన పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ముందస్తు సంక్రాంతి శు భాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో, క్రమశిక్షణతో ఎదగాలని ఆకాంక్షంచారు. అనంతరం ఎంఈఓ, కరస్పాండెంట్ సంప్రదాయబద్ధంగా చిన్నారులకు రేగిపళ్లతో ఆశీర్వదించారు. అనంతరం ఎంఈఓ వెంకట రామిరెడ్డిని పాఠశాల కరెస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినందించారు.

## సంప్రదాయానికి అద్దం పట్టిన పాఠశాల వాతావరణం

**సింహాద్రిపురం – సూర్య వాస్తవం :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింహాద్రిపురం నందు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముందస్తు సంక్రాంతి సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశేషాలు, వాటి వెనుక ఉన్న సాంస్కృతిక విలువలు గురించి అవగాహన కల్పించారు. అలాగే పండుగ సమయంలో జరిగే ముఖ్యమైన కార్యక్రమాలైన రంగవల్లులు వేయడం, గాలిపటాలు ఎగరేయడం, గొబ్బెమ్మలు, కోడి పందాలు,పిండివంటల ప్రదర్శన వంటి కార్యక్రమాలను విద్యార్థులచే చేయించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంతో నింపారు. బాలబాలికలు రంగురంగుల వస్త్రాల్లో ఎంతో ఆనందంగా పాల్గొని సంక్రాంతి సంబరాలను మరింత ఆకర్షణీయంగా మార్చారు. ఈ ముందస్తు సంక్రాంతి సంబరాలు విద్యార్థుల్లో సంస్కృతిపై ప్రేమను పెంపొందించడమే కాకుండా, మన పండుగల ప్రాముఖ్యతను తరతరాలకు అందించేలా నిర్వహించబడ్డాయి. పాఠశాల ప్రాంగణమంతా ఆనందోత్సాహాలతో నిండిపోయి, నిజమైన పండుగ వాతావరణాన్ని తలపింపజేసింది.






## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

# ముందస్తు సంక్రాంతి సంబరాలు..



**పులివెందుల రూరల్ - సూర్య వాస్తవం:** పులివెందుల మండలంలోని అచ్చువెల్లి గ్రామంలోని జెడ్‌పిహెచ్‌ఎస్, ఎమ్‌పిపిఎస్ పాఠశాలలు సంయుక్తంగా ముందస్తు సంక్రాంతి సంబరాలను ఉపాధ్యాయుడు అంగడి నాగేంద్ర సౌజన్యంతో ప్రధానో పాధ్యాయులు వెంకటనాయుడు, రాజశేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి ల పర్యవేక్షణ లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఘనంగా జరుపుకొన్నారు. ముందుగా పాఠశాల ప్రాంగణంను టెంకాయపట్టలతో, మామిడి ఆకులతో, అరటి పిలకలతో, గోబ్బేమ్మలతో సుందరంగా అలంకరించారు. తర్వాత వివిధ రకాల వర్ణములతో కూడిన రంగవల్లు లను,విద్యార్థులు వేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పులివెందుల మండల విద్యాశాఖదికారి-2 ఎస్ రామానాయుడు టెంకాయలు కొట్టి పూజలు ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు మాట్లాడుతూ సంక్రాంతి పండగ ప్రాసస్త్యాన్ని, సంస్కృతి సంప్రదాయంలను మన చిన్నారులకు పాఠశాల స్థాయినుంచే తెలియచేసి విధంగా ఉండాలనే ఉద్దేశం తో సంక్రాంతి పండగ సంబరాలు చేసుకుంటున్నామని తెలియచేసారు తర్వాత ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, నాగేంద్ర లు మాట్లాడుతూ ధనుర్మాసం లో మూడు రోజుల పాటు ముచ్చట గా జరుపుకొనే పండగ అని తెలుగు వారి ఇంట పాడిపంటలు వెల్లివిరిసే సందర్భంగా సకుటుంబ సపరివారముగా బంధుమిత్రులతో స్నేహితులతో కలిసి సంబరంగా జరుపుకొనే తొలి పండగ సంక్రాంతి అని చెప్పడం జరిగింది. తర్వాత చిన్నారులకు ఎమ్ఈఓ ఉపాధ్యాయులు కలిసి రేగుపండ్లు, పూలు, చిల్లర కలిపిన మిశ్రమం వేసి ఆశీస్సులు, దీవెనలు అందచేయడం జరిగింది తర్వాత పాఠశాల ప్రాంగణం లో వేసిన వివిధ రకాల ముగ్గలకు, గోబ్బెమ్మల చుట్టూ విద్యార్థినిలు గోబ్బేమ్మల పాటలు పాడుకుంటూ నృత్యం చేసారు తర్వాత మనలోని చెడుని అగ్నికి అహుతి చేసి భోగిమంటల వెలుగులో విద్యార్థుల జీవితాలు ప్రకాశవంతంగా వెలగాలని అందరూ కలిసి భోగిమంటలు వేయడం జరిగింది తర్వాత ఉట్టి కొట్టె కార్యక్రమం లో విద్యార్థులు,ఉపాధ్యాయులు ఉత్సాహం గా పాల్గొన్నారు అందమైన రంగవల్లులు వేసిన చిన్నారులకు బహుమతులు ఇవ్వడం జరిగింది చివరగా అందరు కలిసి సహపంక్తి భోజనం చేయడం జరిగింది. ఈ కార్య క్రమంలో ఎమ్ ఈ ఓ, ఎస్ రామానాయుడు ప్రధానో పాధ్యాయులు వెంకట నాయుడు ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, అంగడి నాగేంద్ర, సూర్యుడు నాయక్, మధుసూదన్ రెడ్డి, నాగరాజు నాయక్, వల్లిసాహెబ్, జార్జ్, శ్రీనివాసులు, బాలయ్య, సరోజవాణి, విజయలక్ష్మ, ,విద్యా కమిటీ చైర్మన్ షరీఫ్,పంచాయతీ సెక్రటరీ జ్యోతి, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, పి హెచ్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పార్వతీ దేవిగా దర్శనమిచ్చిన వాసవి మాత



**వేంపల్లె - సూర్య వాస్తవం:** స్థానిక పట్టణంలోని మెయిన్ బజార్లో వెలసిన 121 సంవత్సరాలు చరిత్ర గల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ధనుర్మాసం పూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా ధనుర్మాసం 4వ శు క్రవారం పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూల విరాట్ అమ్మవారిని శ్రీ పార్వతీ దేవిగా,ఉత్సవ విగ్రహ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై కోలువుతీర్చి భక్తులకు దర్శనం కల్పించామని తెలిపారు. ఆలయంలో సూర్యోద యానికి ముందు ఏకా వర్తి,ద్వితీయా వర్తి,తృతీయా వర్తి,పంచా వర్తి, నక్షత్ర, రథ,కుంభ హారతులతో పాటు మహా మహా మంగళ హారతి వేద మంత్రోచ్చారణతో నిర్వహించామ న్నారు. అలాగే వాసవి మాతను పల్లకిలో కూర్చోబెట్టి భుజాల మీద ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. వేంపల్లె పట్టణ ఆర్యవైశ్య మహిళలు పార్వతీ నామవాలి, వాసవి అష్టోత్తర నామావలి పారాయణం చేశారు. అమ్మవారి పాటలు పాడి భక్తిని చాటుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మిట్టా మోహన్ రావు,ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు రాయవరం సుబ్బు, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కళ్యాణ మండపం, ఆర్యవైశ్య మహిళా మండలి, తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు....!

**- సి.ఐ లు రాజేంద్రనాథ్ యాదవ్ , వెంకటేష్ నాయక్**

**- జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో అవగాహన కార్యక్రమం**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం నాడు ఆర్ట్స్ కాలేజీలో రోడ్డు భద్రతపై అవగాహన కార యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు త్రీటౌన్ సి.ఐ రాజేంద్రనాథ్ యాదవ్ , ట్రాఫిక్ సి.ఐ వెంకటేష్ నాయక్ లు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మద్యం సేవించి వాహనం నడపకూడదు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. వేగ పరిమితిని తప్పనిసరిగా పాటించాలన్నరు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదనిరహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించి, అమూల్యమైన మానవ ప్రాణాలను కాపాడవచ్చని తెలిజేశారు.

## రైల్వే స్టేషన్లలో పోలీసుల ముమ్మర తనిఖీలు



**కడప -సూర్య వాస్తవం:** కడప జిల్లా ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, సంక్రాంతి రద్దీనేపథ్యంలో దొంగతనాలు, గంజాయి రవాణాను అరికట్టేం దుకు శుక్రవారం రాత్రి కడప రైల్వే స్టేషన్లో వన్ టౌన్ పోలీసులు సీఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులు, పార్శిల్ ఆఫీసును పరిశీలించి, అనుమా నితుల వేలిముద్రలను తనిఖీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారంఇవ్వాలని సీఐ కోరారు.

## మడిసన్నాక కూసింత కళాపోసనుండాలి...

**- ముత్యాలముగ్గు సినిమాలో రావుగోపాల్ రావు డైలాగ్ ఇది**

**- భీమసేనుని పాత్ర వేసిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్**





**కుప్పం -సూర్య వాస్తవం** :కానీ మనలోని కళాతృష్ణను తీర్చుకోవడానికి మనకు ఎన్నో అవకాశాలు దొరుకుతాయి అయినా సమయం ఉండదు. మన మనసులోని ఇచ్ఛను నెరవేర్చు కోవడానికి అవకాశం దొరికినప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇందులో భాగంగా ప్రభుత్వ విప్, తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ శుక్రవారం తన చిరకాల వాంఛను ఈడేర్చుకున్నారు.

- భీమసేనుడి అవతారమెత్తిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కళలకు పుట్టినిల్లయిన కంగుంది కోటలో అడుగుపెట్టి, తనలోని కళా ప్రతిభను భీమసేనుడి పాత్రలో చూసుకోవాలనే ఆకాంక్షతో ఆ పురాణ పురుషుడి వేషధారణను ఎమ్మెల్సీ కంచర్ల ధరించారు. కుప్పం మండలం కంగుంది గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బౌల్డరింగ్ ఫెస్టివల్ సందర్భంగా శుక్రవారం ఫెస్టివల్‌ను సందర్శించి, కంగుంది కళాకారుల అపూర్వ ప్రతిభకు ఆయన ముగ్ధుడయ్యారు. వారి ప్రేరణతో భీమసేనుడి వేషధారణతో తనలోని కళకు ప్రాణం పోశారు. వేసింది కాసేపు విశేషమే అయినా ఆ పాత్రలో ఆయన జీవించారు. ఈ అనుభవాన్నిఆయన మీడియాతో పంచుకున్నారు. తాను వేసింది వేషధారణ మాత్రమే కాదని కుప్పం నియోజకవర్గంలో శతాబ్దాలుగా వేళ్లూనుకున్న కళలకు, సంస్కృతికి, మనం చరిత్రకు ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు





**తిరుపతి- సూర్య వాస్తవం:** తిరుపతి విద్యానగర్ నందు గల తారకరామా బ్రాంచి శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో ఎ.జి.యం.సురేష్ పాల్గొని మన సంస్కృతి, సాంప్రదాయం ,సంక్రాంతి పండుగ యొక్క విశిష్టతను వివరించారు. కోఆర్డినేటర్ రఘునాథ్ వివిధ రైతు వేషధారణతో వచ్చిన పిల్లలను ప్రశంసించారు. ప్రిన్సి పాల్ లక్ష్మ ప్రసన్న భోగిమంట వేసి దాని యొక్క ప్రత్యేకతను వివరిస్తూ పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం మరియు విద్యార్థులు అందరూ సంతోషంగా పాల్గొన్నారు.

## మినర్వా పాఠశాలలో...



**అనంతపురం - సూర్య వాస్తవం:** అనంతపురం అశోక్ నగర్ లోని మినర్వా పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు కన్నుల పండువగా శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులందరూ సంప్రదాయ దుస్తులతో కనువిందు చేశారు. పాఠశాల ఆవరణను రంగవల్లులతో అలంకరించారు. భోగి మంట వేసి, పొంగల్లు పొంగించారు. సంప్రదాయ బద్ధంగా సంక్రాంత్రి సంబరాలు చేసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ భాస్కరరెడ్డి మాట్లాడుతూ మన తెలుగు వారి పెద్దపండుగ సంక్రాంతి అని, రైతులకు-సంక్రాంతికి గల అనుబంధాన్ని వివరించారు. సంక్రాంతి పొంగలి, ముగ్గులు, గొబ్బెమ్మల వైశిష్ట్యాన్ని తెలియజేశారు. చివరగా విద్యార్థులకు భోగిపళ్ళు పోసి ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. విద్యార్థులందరికి పొంగగళ్ళను పంచి పెట్టడంతో సంక్రాంత్రి సంబరాలు ముగిసాయి.

## గ్లోబల్ పబ్లిక్ స్కూల్‌లో ...






**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం :** మండలపరిధిలోని గ్లోబల్ పబ్లిక్ స్కూల్‌లో ముందుస్తు సంక్రాంతి సంబరాలను కరస్పాండెంట్ దాక్షయని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లక్కిరెడ్డిపల్లి సిఐ కృష్ణంరాజు నాయక్ మరియు ఎస్పై శోభా లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి హరిదాసు, గంగిరెద్దు, రైతు, పల్లెపడుచు వేషధారణలతో అలరించారు. పల్లెటూరి వాతావరణం మరిపించేలా రంగవల్లులు భోగి మంటలు వేసి కోలాటాలాడారు, పొంగళ్ళు వండారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణంరాజు నాయక్ మాట్లాడుతూ మన పండుగుల్లో సంక్రాంతి పండుగ మన సంస్కృతిని ప్రతిబింబించే పండుగ అని, ఈ పండుగకు పల్లెల్లో ధాన్యరాసులతో వర్ధిల్లుతాయని తెలిపారు. అనంతరం ఎస్పై శోభ మాట్లాడుతూ సంక్రాంతి సౌర మాసం జరుపుకునే పండుగని సూర్యుడు మకర రాశి లోకి ప్రవేశించే శుభ ఘడియలే మకర సంక్రాంతి అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రజలందరూ జరుపుకునే పెద్ద పండుగని తెలిపారు. ప్రజలంతా కలిసిమెలిసి జరుపుకునే పండుగ సంక్రాంతి అని అందరూ సుఖసంతోషాలతో ఈ పండగ జరుపుకోవాలి ఆకాంక్షంచారు. అనంతరం ఆటల పోటీలలో వేషధారణలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )